


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 12 అక్టోబరు 2021 | సంపుటి : 03 | సంచిక : 61 | పేజీలు : 4 | వెల : రూ







# అన్ని స్కూళ్లకూ సీబీఎస్ఈ అఫిలియేషన్: సీఎం జగన్



అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో స్కూళ్ల నిర్వహణ, విద్యార్థుల హాజరు, అమ్మ ఒడి, విద్యాకానుకపై అధికారులతో సీఎం విస్తృతంగా చర్చించారు.స్కూళ్లలో హాజరు నానాటికీ మెరుగు:కరోనా తర్వాత పాఠశాలల్లో పరిస్థితులు, విద్యార్థుల హాజరుపై సీఎం ఆరా.పాఠశాలల్లో కరోనా నివారణ చర్యలను అడిగి తెలుసుకున్న సీఎం. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కారణంగా పాఠశాలలపై కరోనా ప్రభావం పెద్దగా లేదని చెప్పిన అధికారులుటీచర్లందరికీ వ్యాక్సినేషన్ పూర్తయినందున వారుకూడా విధుల్లో చురుగ్గా పాల్గొంటున్నారన్న అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి...ఆగస్టులో పిల్లల హాజరు 73 శాతంగా ఉందని, సెప్టెంబరులో 82 శాతానికి పెరిగిందని, అక్టోబరు నాటికి 85శాతం నమోదైందని తెలిపిన అధికారులు. ప్రభుత్వం పాఠశాలల్లో హాజరు భారీగా పెరిగిందని, ప్రస్తుతం 91శాతం హాజరు ఉందని తెలిపిన అధికారులు. 'అమ్మ ఒడి' పథకం స్ఫూర్తి కొనసాగాలి:పిల్లల్ని బడిబాట పట్టించాలన్నదే అమ్మ ఒడి పథకం ప్రధాన ఉద్దేశం: సీఎంఆ దిశగా తల్లులను, పిల్లలను చైతన్యం చేయడానికి అమ్మ ఒడి పథకాన్ని తీసుకు వచ్చాం:విద్యాకానుకను అమలు చేస్తున్నాం:వేల కోట్లరూపాయలు ఖర్చుచేసి తొలివిడతలో 15వేలకుపైగా స్కూళ్లు తీర్చిదిద్దాం:అమ్మ ఒడి స్ఫూర్తి కొనసాగాలి, పిల్లలంతా బడిబాట పట్టాలి:అమ్మ ఒడి పథకం అమలు సందర్భంగా విడుదల చేసిన ఉత్తర్వుల్లో 75శాతం హాజరు ఉంచాలన్న నిబంధన పెట్టాం:కోవిడ్ పరిస్థితులు కారణంగా ఆ నిబంధనలను అమలు చేయలేని పరిస్థితి నెలకొంది:రెండేళ్లుగా కోవిడ్ కారణంగా పాఠశాలలు సరిగ్గా నడవని పరిస్థితి ఏర్పడింది:అమ్మ ఒడి అమలుకు 75 శాతం హాజరు తప్పనిసరి అన్న నిబంధనను మనం పరిగణలోకి తీసుకోలేని పరిస్థితులు వచ్చాయి:అధికారంలోకి వచ్చిన వెంటనే 2020 జనవరిలో అమ్మ ఒడి పథకాన్ని ప్రారంభించాం, మార్చి చివరి వారంలో కోవిడ్ ప్రారంభం అయ్యింది :


అమ్మ ఒడి అమల్లోకి వచ్చిన 2?3 నెలలు తిరగకముందే కోవిడ్ ప్రారంభం అయ్యింది, స్కూళ్లు మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది:తిరిగి 2020, నవంబరు, డిసెంబరుల్లో పాఠశాలలు తెరిచాం:జనవరి 2021లో మళ్లీ అమ్మ ఒడి ఇచ్చాం, మళ్లీ రెండో వేవ్ కోవిడ్ వచ్చింది:పరీక్షలే నిర్వహించలేని పరిస్థితులు వచ్చాయి:ఈ ఏడాది కూడా జూన్‌లో ప్రారంభం కావాల్సిన స్కూళ్లను ఆగస్టు 16 నుంచి ప్రారంభించాం:2022 నుంచి 'అమ్మ ఒడి' పథకానికి హాజరుకు అనుసంధానం చేయాలి: 75 శాతం హాజరు ఉండాలని ఇదివరకే మనం నిర్దేశించుకున్నాం:ఈ ఏడాది ఈ నిబంధనను పరిగణలోకి తీసుకోవాలి:సాధారణంగా జూన్‌లో స్కూళ్లు ప్రారంభం అయితే ఏప్రిల్‌వరకూ కొనసాగుతాయి:కాబట్టి ... ఆ విద్యాసంవత్సరంలో పిల్లల హాజరును పరిగణలోకి తీసుకోవాలి:హాజరును పరిగణలోకి తీసుకుని జూన్‌లో పిల్లల్ని స్కూల్‌కు పంపే సమయంలో, విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అమ్మ ఒడిని అందించాలి:అమ్మ ఒడి, విద్యాకానుక రెండూ కూడా పిల్లలు జూన్‌లో స్కూల్‌కి వచ్చేటప్పుడు ఇవ్వాలిఅకడమిక్ ఇయర్‌తో అమ్మ ఒడి అనుసంధానం కావాలి:అన్ని స్కూళ్లకూ– సీబీఎస్ఈ అఫిలియేషన్అన్ని స్కూళ్లకూ సీబీఎస్ఈ అఫిలియేషన్ తీసుకొచ్చేదిశగా చర్యలు తీసుకోవాలి: సీఎం2024 నాటికి పిల్లలు సీబీఎస్ఈ పరీక్షలు రాసే దిశగా ముందుకు సాగాలి: సీఎంప్రతి హైస్కూల్‌కు కచ్చితంగా ప్లే గ్రౌండ్‌ఉండాలి:దీనిమీద మ్యాపింగ్‌చేసి.. ప్లే గ్రౌండ్‌లేని చోట భూ సేకరణచేసి ప్లే గ్రౌండ్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చేలా చూడాలి:ఈమేరకు ప్రణాళిక సిద్ధంచేయాలని సీఎం ఆదేశంకాలక్రమేణా ప్రి హైస్కూల్ స్థాయి వరకూ ప్లే గ్రౌండ్‌ఉండేలా చర్యలు తీసుకోవాలి: ఈ సమీక్షా సమావేశానికి విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్, మహిళా, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఏ ఆర్ అనురాధ, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ (దిశ స్పెషల్ ఆఫీసర్) కృతికా శుక్లా, ఎండిఎం అండ్ శానిటేషన్ డైరెక్టర్ బి ఎం దివాన్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వాడ్రేవు చినవీరభద్రుడు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ (ఎస్‌సీఈఆర్‌టీ) బి ప్రతాప్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ప్రపంచాన్ని అనుసంధానించడంలో స్పేస్‌ది కీలకపాత్ర : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ : ప్రపంచాన్ని అనుసంధానించడంలో అంతరిక్షం కీలక పాత్ర పోషిస్తుందని, భారతదేశాన్ని నూతన ఆవిష్కరణ కేంద్రంగా మారుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశాన్ని నూతన ఆవిష్కరణ కేంద్రంగా మార్చాల్సి ఉన్నదని తెలిపారు. ఎండ్ టు ఎండ్ టెక్నాలజీని కలిగి ఉన్న అతికొద్ది దేశాల్లో భారతదేశం ఒకటి అని ఆయన పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధన లేదా అంతరిక్ష సాంకేతికతలను నిరంతరం అన్వేషించాలని అన్నారు.భారత అంతరిక్ష సంఘం (ఐఎస్‌పీఏ) ను సోమవారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా, ప్రధాని మోదీ పలువురు శాస్త్రవేత్తలు, ఐఎస్‌పీఏ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఐఎస్‌పీఏ వ్యవస్థాపక సభ్యులలో లార్సెన్ అండ్ టూబ్రో, నెల్కో (టాటా గ్రూప్), వన్‌వెబ్, భారతీ ఎయిర్‌టెల్, మ్యాప్‌మై ఇండియా, వాల్‌చంద్‌నగర్ ఇండస్ట్రీస్, అనంత్ టెక్నాలజీ లిమిటెడ్ ఉన్నాయి. ఇతర సభ్య సంస్థల్లో గోద్రేజ్, అగిస్టా– బీఎస్‌టీ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్, బీఈఎల్, సెంటమ్ ఎలక్ట్రానిక్స్, మాక్సర్ ఇండియా ఉన్నాయి. ఎయిర్ ఇండియాపై తీసుకున్న నిర్ణయం మా నిబద్ధత, తీవ్రతను తెలియజేస్తుందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ వెల్లడించారు. పేదల ఇళ్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో శాటిలైట్ ట్రాకింగ్ లేదా నావిగేషన్ టెక్నాలజీ అయినా.. పాలనను పారదర్శకంగా చేయడానికి సహాయపడుతున్నాయన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అగ్రశ్రేణి డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ముందంజలో ఉంటే, పేదవారికి కూడా డాటాను అందుబాటులో ఉండేలా చేశామని తెలిపారు.

# హైకోర్టు తీర్పు లక్షలాది మంది ఆశల మీద నీళ్లు చల్లినట్లైంది: సజ్జల



తాడేపల్లి: 'పేదలందరికి ఇళ్లు' పథకంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ద్వారా పెద్దదెబ్బ తగిలిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. హైకోర్టు తీర్పు లక్షలాది మంది ఆశల మీద నీళ్లు చల్లినట్లు అయ్యిందన్నారు. ఈ తీర్పుతో ఎంతోమంది లబ్ధిదారులు ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు తాడేపల్లిలో సోమవారం సజ్జల మాట్లాడుతూ.. పిటిషన్ వేసిన వారిలో కొంతమంది ఆ పిటిషన్‌తో సంబంధమే లేదని అంటున్నారని.. మరి దీని వెనుక ఎవరున్నారని ప్రశ్నించారు. దుష్ట పన్నాగాలతో కొన్ని రాజకీయ శక్తులు తెరవెనక ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. ఇలాంటి వాటికి పేరుమోసిన టీడీపీ వెనక ఉందని నమ్ముతున్నామన్నారు. అయితే తమకు కోర్టులు న్యాయం చేస్తాయనే నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇల్లు లేని వారు ఏపీలో ఇప్పటికీ 31 లక్షల మంది ఉన్నారని తేలిందని, చరిత్రలో వైఎస్సార్ తర్వాత ఇప్పుడే పెద్ద ఎత్తున భారీ యజ్ఞానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. తొలిదశలో 15 లక్షల నిర్మాణాలు కూడా చేపట్టామని, ఇల్లు లేదని ఏ ఒక్కరు చేయి ఎత్తకూడదని తాము భావించామన్నారు. మహిళకు ఇవ్వడం, వారికి ఓనర్ షిప్ ఇవ్వడం అనేది తమ ఆలోచన అని, తమ పార్టీ అధినేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో తెలుసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. ఆ ఇల్లు వారికి నివాసమే కాకుండా ఒక ఆస్తిగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఆధునిక టౌన్ షిప్‌లు తయారు చేయడం తమ ధ్యేయమని, అన్ని వసతులతో ఆ కాలనీలను తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. అయితే సీఎం జగన్‌పై ఉన్న అసూయతో చంద్రబాబు చేసిన నిర్వాకమే ఇదని, ఎన్‌బీసీ స్టాండర్డ్స్ ప్రకారమే స్థలం ఎంత ఉండాలనేది నిర్ణయించామన్నారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు 215 చదరపు అడుగులు ఉంటే ఇప్పుడు 340 చదరపు అడుగులు ఇస్తున్నట్లు వెల్లడించారు. చాలా రాష్ట్రాల కంటే, ఎన్‌సీబీ గైడ్ లైన్స్ మించి తాము ఇళ్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. టిడ్కో ఇల్లు తాము ఇచ్చే దానికంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయని, తాము ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో ఇండిపెండెంట్ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. కేవలం జగన్‌మోహన్‌రెడ్డిపై చులకన భావం తీసుకురావాలని చంద్రబాబు దుర్బుద్ధి అని విమర్శించారు. 'ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాల్సిన చంద్రబాబు ఇలా కోర్టులను అడ్డుపెట్టుకుని కుయుక్తులు చేస్తున్నాడు. ఇప్పుడు ఇల్లు సొంత ఆస్తిలా మారకూడదనే దుర్బుద్ధి కనిపిస్తోంది. చంద్రబాబు దుర్బుద్ధితో చేసిన ఈ ప్రయత్నానికి ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారు. మేము ఎప్పుడూ మీ పసుపు కుంకుమ లాంటి కుట్రలు చేయం. బద్వేల్ ఎన్నికలో ప్రజల తీర్పుపై మాకు సందేహమే లేదు. ఈ రెండేళ్లలో మా ప్రభుత్వం చేసిన సంక్షేమమే మమ్మల్ని గెలిపిస్తోంది. బీజేపీ వాళ్ళకి తెలిసిన పాండిత్యం అంతా మతమే. సునీల్ థియోధర్ కూడా అదే మాట్లాడుతున్నాడు. లేని మతం అనే అంశాన్ని తెచ్చి ఏదో లబ్ధి పొందాలని చూస్తున్నారు. రాష్ట్రంలో అప్పుల గురించి మాట్లాడతారు కానీ కేంద్రం చేసిన అప్పులు గురించి మాట్లాడటం లేదు యూపీలో రైతులపై కారు ఎక్కించిన అంశంపై మాట్లాడరు. ఏ ఎన్నికైనా మేము సీరియస్‌గానే తీసుకుంటాం. వాళ్లు ఎన్ని ఆరోపణలు చేసినా ప్రజా క్షేత్రంలో వాటిని తిప్పికొడతాం. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. బొగ్గు కొరత వచ్చింది. విద్యుత్ కొనుగోలు రేట్లు కూడా పెరిగాయి. ఈ సందర్భంలో గృహావసర విద్యుత్ వినియోగం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది. టీడీపీ ఆరోపించినట్లు పేమెంట్స్ సమస్య లేదు. కొనుగోలు చేయడానికి అక్కడ బొగ్గే దొరకడం లేదు. రానున్న అయిదారు నెలల్లో ప్రజలు కొంత విద్యుత్ ఆదా దిశగా ప్రయత్నాలు చేయాలి. ఉద్యోగ సంఘాలతో మేము సంప్రదింపులు చేస్తూనే ఉన్నాం. వాళ్ళ సమస్యలను పరిష్కరించడానికి మేము ప్రయత్నం చేస్తున్నాం. మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం.' అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# టీడీపీ హయాంలో రూ.లక్షా 70 వేల కోట్లు రాష్ట్రానికి అప్పుంది: బొత్స



అమరావతి: గత ఐదు సంవత్సరాల తెలుగుదేశం ప్రభుత్వంలో లక్షా 70 వేల కోట్ల రూపాయలు రాష్ట్రానికి అప్పుగా ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక పక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పవన్ కల్యాణ్ గానీ..మరొకరు ఎవరైనా గానీ చంద్రబాబును అడగాల్సి ఉందని బొత్స పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలు కళ్ళు మూసుకొని ఇవాళ వచ్చి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని మాట్లాడుకున్నా తమకు అనవసరమన్నారు. వాళ్ల ఉద్దేశం ఏమిటంటే ప్రజల్లో జగన్మోహన్ రెడ్డి అన్ పాపులర్ కావాలని బొత్స పేర్కొన్నారు.

# చిన్న పిల్లల కార్డియాక్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం జగన్

తిరుపతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి, తిరుమలలో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో శ్రీపద్మావతి చిన్న పిల్లల కార్డియాక్ సెంటర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అలిపిరి



వద్దకు చేరుకున్న సీఎం జగన్.. శ్రీవారి పాదాల వద్ద నుంచి తిరుమలకు నడక మార్గం, పై కప్పును, గోమందిరాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి తిరుమల చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌కు పద్మావతి అతిథి గృహం వద్ద టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో, మంత్రులు స్వాగతం పలికారు.

బేడి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న సీఎం జగన్

అనంతరం సాంప్రదాయ పంచకట్టుతో ఆలయానికి చేరుకున్న సీఎం జగన్.. బేడి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకుని స్వామి వారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. స్వామివారి దర్శనం అనంతరం ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. తర్వాత పద్మావతి అతిథి గృహానికి చేరుకుని, రాత్రికి అక్కడే బస చేస్తారు.

# జగన్ ఏపీని అప్పులపాలు చేసి అభివృద్ధిని విస్మరించారు: చినరాజప్ప



అమరావతి: సీఎం జగన్ ఏపీని అప్పులపాలు చేసి అభివృద్ధిని విస్మరించారని మాజీమంత్రి నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రోడ్ల నిర్మాణం సహా అభివృద్ధిపనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురాని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. గత ప్రభుత్వంలో పనులుచేసిన వారికి బిల్లులు ఇవ్వలేదని చెప్పారు. కమీషన్లు ఇస్తేనే ప్రభుత్వం బిల్లులు క్లియర్ చేస్తోందని ఆరోపించారు. నరేగా నిధులకోసం కాంట్రాక్టర్లు కోర్టులకు వెళ్లాల్సిన దౌర్భాగ్యాన్ని ముఖ్యమంత్రి కల్పించాడని విమర్శించారు. రాష్ట్రానికి ఎక్కడా అప్పులుకూడా పుట్టని దుర్గతి జగన్‌రెడ్డి కల్పించారని ఆరోపించారు.

# సీజే జస్టిస్ గోస్వామికి హైకోర్టు ఘన వీడ్కోలు

అమరావతి: ఛత్తీస్‌గఢ్ ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అరూప్‌కుమార్ గోస్వామికి ఆదివారం హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, వారి కుటుంబసభ్యులు, అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్, బార్ కౌన్సిల్ ఛైర్మన్ గంటా రామారావు, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజే జస్టిస్ గోస్వామి మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తి చాలా కఠినమైనదని, సవాళ్లతో కూడుకున్నదని చెప్పారు. ఈ వృత్తి జీవితంలో పైకొచ్చిన తరువాత కూడా నిత్యం సవాళ్లను ఎదుర్కొంటునే ఉంటామన్నారు. ఆశను ఎప్పుడూ వదులుకోకూడదని చెప్పారు. విజయానికి దగ్గరిదారులు వెతకొద్దని, కష్టపడే తత్వానికి ప్రత్యామ్నాయం లేనేలేదని పేర్కొన్నారు. తక్కువ కాలమైనా ఆంధ్రప్రదేశ్‌లో పనిచేయడం తనకు ఎంతో సంతోషానిచ్చిందన్నారు. తనకు సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు ఏజీ శ్రీరామ్ మాట్లాడుతూ జస్టిస్ గోస్వామి సేవలను కొనియాడారు.గవర్నర్ తేనీటి విందు: బదిలీపై వెళుతున్న చీఫ్ జస్టిస్ అరూప్‌కుమార్ గోస్వామి గౌరవార్థం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌లో ఆదివారం రాత్రి తేనేటి విందు ఇచ్చారు. సీజే గోస్వామి, నీలాక్షి గోస్వామి దంపతులను గవర్నర్ సత్కరించి వీడ్కోలు పలికారు. గవర్నర్ సతీమణి సుప్రవ హరిచందన్, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తదితరులు పాల్గొన్నారు. వించిపేట (విజయవాడ పశ్చిమ): శరన్నవరాత్రి మహోత్సవాల్లో నాలుగో రోజు ఆదివారం శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను హైకోర్టు చీఫ్ జస్టిస్ అరూప్‌కుమార్ గోస్వామి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన సీజే గోస్వామి దంపతులకు ఈవో భ్రమరాంబ, అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం చీఫ్ జస్టిస్‌కు ఈవో అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

జస్టిస్ పీకే మిశ్రా సీజేగా 13న ప్రమాణం

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఈ నెల 13న ప్రమాణం చేయనున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆయన చేత గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, న్యాయమూర్తులు, మంత్రులు తదితరులు పాల్గొననున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి జస్టిస్ మిశ్రా ఈ నెల 12న విజయవాడ చేరుకుంటారు. ప్రమాణ స్వీకార ఏర్పాట్లను ఆదివారం సీఎం ముఖ్య కార్యదర్శి ముత్యాలరాజు పరిశీలించారు.

# సంపాదకీయం

మంగళవారం 12 అక్టోబరు 2021

## కొలిక్కి వచ్చిన ఇండియా చైనా చర్చలు

భారత్, చైనాల మధ్య కార్ప్స్ కమాండర్ స్థాయి చర్చలు కొలిక్కి వచ్చినట్లే. ఎల్ఏసీలో చైనాలోని భాగమైన మోల్డోలో చర్చలు ముగిసాయి. లెహ్‌లో ఉన్న కార్ప్స్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ పీజీకే మీనన్ భారత జట్టుకు నాయకత్వం వహిస్తారు. మేజర్ జనరల్ లియు లిన్, దక్షిణ జింజియాంగ్ మిలటరీ డిస్ట్రిక్ట్ కమాండర్, చైనా వైపు నాయకత్వం వహిస్తారు. లడఖ్ సరిహద్దులో ఇరు దేశాల మధ్య సైనిక ఘర్షణ చాలా కాలంగా కొనసాగుతోంది. ఈరోజు చర్చల్లో, హాట్ స్ప్రింగ్‌లో ఉన్న సైనికుల సమస్య గురించి చర్చిస్తారని తెలుస్తోంది. ఇరుపక్షాల మధ్య సైనిక స్థాయిలో 12 రౌండ్ల చర్చలు జరిగాయి. కానీ ఇంతవరకు ఖచ్చితమైన పరిష్కారం దొరకలేదు. ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే శనివారం సాయంత్రం తన ప్రాంతంలో చైనా మౌలిక సదుపాయాలను నిర్మిస్తోందని చెప్పారు. గత సంవత్సరం తీసుకువచ్చిన అదనపు దళాలు, సైనిక సామగ్రిని సులభతరం చేయడానికి రెండు దేశాలు ఎల్ఏసీ పశ్చిమ భాగంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నాయని నరవణే చెప్పారు. గత వారం తన తూర్పు లడఖ్ పర్యటనలో కూడా ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేశారుపాంగోంగ్ త్సో, గోగ్రా పోస్ట్ ఉత్తర, దక్షిణ ఒడ్డున ఉన్న హాట్ స్ప్రింగ్స్ సైనికులు వెనక్కి తగ్గారు. కానీ, వేడి నీటి బుగ్గల వద్ద ఉండిపోయారు. మే 2020 లో చైనీయులు ఎల్ఏసీ ను దాటినప్పటి నుండి ఇక్కడి సైన్యాలు ఒకదానికొకటి ఎదుర్కొంటున్నాయి. భారతీయ సైనికులు డెప్‌సాంగ్ మైదాన్ యొక్క సాంప్రదాయ పెట్రోలింగ్ పాయింట్‌లకు వెళ్లకుండా చైనీయులు కూడా నిరోధిస్తున్నారు. ఈ ప్రాంతం కారకోరం పాస్ సమీపంలో దౌలత్ బేగ్ ఓల్డి వద్ద ఉన్న వ్యూహాత్మక భారతీయ అవుట్‌పోస్ట్‌కు చాలా దూరంలో లేదు. లడఖ్‌లో మాత్రమే కాకుండా అరుణాచల్ ప్రదేశ్‌లో కూడా చైనా తన చేష్టల నుండి తప్పుకోవడం లేదు. గత వారం, అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో భారత సైనికులు చైనా సైనికులతో ఘర్షణ పడ్డారు. పెట్రోలింగ్ సమయంలో, రెండు దేశాల సైనికులు సరిహద్దు వివాదంపై ముఖాముఖికి వచ్చారు. ఈ ప్రక్రియ కొన్ని గంటలు కొనసాగింది. అయితే, ఇందులో భారత సైనికులకు ఎలాంటి హాని జరగలేదు. ప్రోటోకాల్ ప్రకారం చర్చల ద్వారా వివాదం పరిష్కారం అయింది. ఇటీవల, ఆగస్టు 30 న ఉత్తరాఖండ్‌లోని బారాహోటి సెక్టార్‌లో 100 మంది చైనా సైనికులు చొరబడ్డారని, 3 గంటలపాటు అక్కడే తిరిగొచ్చారని వార్తలు వచ్చాయి. మీడియా నివేదికల ప్రకారం, గుర్రాలపై చైనా సైనికులు భారత సరిహద్దులోకి ప్రవేశించి, తిరిగి వచ్చే ముందు వంతెనను ధ్వంసం చేశారు. 1962 యుద్ధానికి ముందు కూడా చైనా చొరబడిన ప్రాంతం బారాహోటి.ల్ఏసీలో వేలాది అడుగుల ఎత్తైన శిఖరాల మధ్య, మంచు మైదానాలు, నడవడానికి కూడా వీల్లేని పరిస్థితులు ఉంటాయి. అయితే, విస్తరణ కాంక్షతో రగిలిపోతున్న చైనా.. నిరంతరం ఎల్ఏసీలో కుట్రలు చేస్తూ వస్తోంది. అందులో బాగంగానే ఎల్ఏసీలో తమ బలగాలను భారీగా మోహరిస్తోంది. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ బలగాలను భారీగా తరలిస్తోంది. అయితే, చైనా కుట్రలకు ప్రపంచ దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. ప్రకృతి మాత్రం చైనాకు చుక్కలు చూపిస్తోంది. ఎల్ఏసీలో పీఎల్ఏ సైనికుల సాహసాలు అంటూ చైనా ఎన్ని వీడియోలు విడుదల చేస్తున్నా.. వాస్తవ పరిస్థితులు వేరే ఉన్నాయట. హిమాయ పర్వతపంక్తులలో చైనా సైన్యం ఉక్కిరిబిక్కిరి అవుతోందట. అక్కడి మీడియా నివేదిక ప్రకారం.. లడఖ్‌లో అతి తీవ్రమైన చలి.. పీఎల్ఏ జవాన్లకు మరణశాసనంగా మారిందట. పర్వత ప్రాంతాల్లో తీవ్రమైన చలి, ఆక్సీజన్ స్థాయిలు తక్కువగా ఉండటం చైనా సైనికుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించిందట. ఒకరి తరువాత ఒకరుగా సైనికులు, కమాండర్లు అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా పీఎల్ఏ జనరల్ జాంగ్ జుండాంగ్ అనారోగ్యానికి గురైన వార్త.. దీనిని ధృవీకరిస్తోంది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ ప్రకారం.. పీఎల్ఏ జనరల్ జాంగ్ జుడాంగ్ మరణించాడు. జుడాంగ్.. చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌కు ఇష్టమైన, విశ్వసనీయ జనరల్స్‌లో ఒకరుగా గుర్తింపు పొందాడు. ఈ కారణంగానే అతను పీఎల్ఏ వెస్ట్రన్ థియేటర్ కమాండ్ కమాండర్‌గా నియమించబడ్డాడు. ఇతని నేతృత్వంలోని దళం లడక్ నుండి అరుణాచల్ ప్రదేశ్ వరకు ఎల్ఏసీలో కుట్రలు చేయడంలో దిట్ట. జాంగ్ జుడాంగ్ డిసెంబర్ 2020 లో కమాండర్‌గా నియమించబడగా.. కేవలం 6 నెలల్లోనే పవి నుంచి వైదొలిగాడు. ఈ ఏడాది జూన్‌లో తన పదవి నుంచి తప్పుకున్నాడు. కారణం.. హిమాలయాల్లోని కఠినమైన పరిస్థితులను తట్టుకోలేకపోవడమేనట. హిమాలయాల్లోని వాతావరణ పరిస్థితుల కారణంగా జుడాంగ్ తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే తాజాగా జుడాంగ్ ప్రాణాలు వదిలాడు. ఇక జుడాంగ్ తరువాత వచ్చిన జనరల్ షు కిలింగ్ పరిస్థితి కూడా అలాగే ఉందట. వెస్ట్రన్ థియేటర్ కమాండ్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టిన కిలింగ్.. రోజుల వ్యవధిలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో కమాండర్ బాధ్యతలను వాంగ్ హైజియాంగ్‌కు అప్పగించింది చైనా ప్రభుత్వం.

## నెట్టెం రఘురామ్ దారిలో నడవడం కష్టమే

విజయవాడ, అక్టోబరు 11, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో ఎక్కడ చక్రం తిప్పాలన్నా కూడా నాయకుల సహకారం, సమష్టి కృషి చాలా అవసరం. అయితే, ఈ వ్యూహం ప్రస్తుతం టీడీపీలో కనిపించడం లేదని అంటున్నారు పరిశీలకులు. తాజాగా చంద్రబాబు నియమించిన పార్లమెంటరీ నియోజకవర్గాల ఇంచార్జుల విషయంలో స్థానికంగా ఉన్న నాయకులు కలిసి వచ్చే అవకాశం కనిపించడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా విజయవాడ పార్లమెంటరీ జిల్లా నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా ఔట్ డేటెడ్ నాయకుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ కు చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. అయితే, ఈయనపై ఇప్పటికే గుస్సాగా ఉన్న నాయకులు ముమ్మందు కలిసివస్తారా ? అనేది సందేహం. బెజవాడ పార్లమెంటు నియోజకవర్గంలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని నాయకులు నెట్టెం రఘురామ్ తో అస్సలు కలిసి వచ్చే అవకాశం లేదు. నందిగామ రాజకీయాల్లో కీలకంగా ఉన్న మాజీ మంత్రి దేవినేని ఉమాతో పాటు ఆయన అన్న దివంగత మాజీ మంత్రి దేవినేని వెంకట రమణ జీవించి ఉన్నప్పటి నుంచి నెట్టెం వర్సెస్ దేవినేని అన్నట్టుగా రాజకీయాలు నడిచేవి. ఇద్దరూ ఒకే పార్టీలో ఉన్నా జగ్గయ్యపేటలో నెట్టెం గెలిస్తే తమకు మంత్రి పదవి రాదని దేవినేని సోదరులు ఆయనకు వ్యతిరేకంగా చక్రం తిప్పేవారని.. అలాగే నందిగామలో దేవినేని సోదరులకు వ్యతిరేకంగా నెట్టెం రఘురామ్ వ్యవహారాలు నడిపేవారన్న టాక్ అప్పటి నుంచే ఉంది. నాటి నుంచి నేటి వరకు రాజకీయ రేసులో నెట్టెం రఘురామ్ వెనకపడిపోయి, దేవినేని ఉమా పైచేయి సాధించినా కూడా వీరి మధ్య పొరా పొచ్చలు అలాగే ఉన్నాయి. నందిగామ, మైలవరం ప్రస్తుతం ఉమా కనుసన్నల్లో ఉండడంతో అక్కడ నెట్టెం రఘురామ్ చేసేదేం ఉండదు. అదే సమయంలో విజయవాడ ఎంపీ నాని కూడా నెట్టెం రఘురామ్ తో కలిసి పనిచేయడం కష్టమేనని అంటున్నారు. నానికి, నెట్టెంకు మధ్య కూడా పెద్దగా సఖ్యత లేదట. ఇప్పటికే రెండుసార్లు గెలిచిన నాని పార్టీ అధిష్టానాన్నే లెక్క చేయట్లేదు. ఈ నేపథ్యంలో నెట్టెం రఘురామ్ లాంటి మాటలను ఆయన పట్టించుకునే ఛాన్సులే లేవు. ఇక, జగ్గయ్య పేటలో శ్రీరాంతాతయ్య రెండు సార్లు గెలిచారు. గత ఏడాది ఎన్నికల్లో ఓడిపోయారు. ఇక్కడ 1999, 2004 ఎన్నికల్లో నెట్టెం రఘురామ్ ఓడిపోగా 2009లో ఆయన స్వచ్ఛందంగా తప్పుకున్నారు. మధ్యలో తాతయ్య రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కూడా ఇప్పటికీ నెట్టెం రఘురామ్ టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఈ పరిణామాలతో తాతయ్య సైతం అసహనంతోనే ఉన్నారు. ఇప్పుడు ఆయన కూడా నెట్టెం రఘురామ్ దారిలో నడవడం కష్టమేనని చెబుతున్నారు. అదే సమయంలో నెట్టెం సొంత బావ .. తొండెపు దశరథ జనార్దన్‌తోనూ నెట్టెంకు విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయవాడ పార్లమెంటరీ జిల్లా ఇంచార్జ్‌గా ఉన్నప్పటికీ నెట్టెం రఘురామ్ పార్టీని ఏమేరకు ముందుకు తీసుకువెళ్తారనేది సందేహమేనని అంటున్నారు పరిశీలకులు. మరి ఏంచేస్తారో ? చూడాలి.

## రోజు రోజుకు పెరుగుతున్న ఉల్లి కష్టాలు



కర్నూలు, అక్టోబరు 11, (న్యూస్ పల్స్) కర్నూలు జిల్లాలో ఉల్లి రైతుల కష్టాలు రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ఉల్లి దిగుబడులను మార్కెట్‌కు తీసుకురావద్దని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. పొలాల్లో కోత కోసిన ఉల్లికి మార్కెట్ లేకపోవడంతో రైతులు పంటపొలాల్లోనే గుట్టలుగుట్టలుగా నిల్వ చేసు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌కు భారీగా ఉల్లి మొత్తాన్ని కొనుగోలు చేయలేమని వ్యాపారులు చేతులెత్తేశారు. దీంతో మార్కెటింగ్ శాఖ అధికారులు మార్కెట్‌కు వచ్చే ఉల్లిని నియంత్రించడం మొదలుపెట్టారు. మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే వేదంగా ఉండడంతో ధర కూడా ఇష్టారాజ్యంగా నడుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ. 15 నుంచి 20 ఉండగా మార్కెట్‌యార్డులో రైతులకు కిలో రూ. 3 కూడా దక్కడం లేదు. గత వారం రోజులుగా ఉల్లి ధర కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో అమాంతంగా పడిపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోనే కర్నూలు జిల్లాలో ఉల్లిని అత్యధికంగా సాగు చేస్తారు. ఖరీఫ్, రబీ కలిపి జిల్లాలో దాదాపు 56 వేల ఎకరాల్లో ఉల్లి సాగవుతుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో 50 వేల ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. ఎకరాకు రూ. 50 నుంచి 60 వేల దాకా పెట్టుబడి అవుతుంది. అదే కౌలు రైతు మరో రూ. 20 వేలు అదనంగా పెట్టాలి. వాతావరణం బాగా అనుకూలిస్తే ఎకరాకు 80 నుంచి 100 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఎకరాకు 50 క్వింటాళ్లు కూడా రాలేదు. మార్కెట్‌లో క్వింటా రూ. 1500 వస్తేకాని రైతులకు గిట్టుబాటు కాదు. దిగుబడులు తగ్గిపోవడం, మార్కెట్‌లో ధర అమాంతంగా పడిపోవడంతో రైతులు భారీ ఎత్తున నష్టాలను మూటగట్టుకుంటున్నారు. కర్నూలు జిల్లాకంతా కలిపి కేవలం కర్నూలు వ్యవసాయయార్డులోనే ఉల్లి కొనుగోళ్లు చేస్తారు. కేవలం ఒకే మార్కెట్‌లో ఉల్లి క్రయవిక్రయాలు ఉండడంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ఉల్లి ధరలు తగ్గినప్పుడు మార్క్‌ఫెడ్, సివిల్ సప్లరు లాంటి సంస్థలు కొనుగోలు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వం తక్షణం మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లను ప్రారంభింపజేయాలని రైతులు కోరుతున్నారు

## న్యాయవ్యవస్థ మధ్య సన్నగీత చెరిపేస్తున్నారా...

విజయవాడ, అక్టోబరు 11, (న్యూస్ పల్స్)భారత రాజ్యాంగాన్ని రాసిన అంబెద్కర్ వంటి మహనీయులు ముందు కాలాన్ని మరీ ఎక్కువగా అంచనా వేయలేక పోయి ఉండవచ్చునేమో. అందుకే విచక్షణ అన్న దానికే మన రాజ్యాంగంలో ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. కొన్ని కీలకమైన స్థానాల్లో ఉన్న వారు తీసుకునే నిర్ణయాలను కనీసం ప్రశ్నించే అవకాశం అధికారం ఈ దేశ పౌరులకు లేకుండా పోయింది. మనది అచ్చమైన ప్రజాస్వామ్యం అనుకున్నపుడు ప్రజల చేతిలో అంతిమ అధికారం దఖలు పడాలి. అలా కాని నాడు అది పూర్తి ఎప్పటికీ కాదు. మన ప్రజాస్వామ్యం సజావుగా నడవాలంటే శాసనవ్యవస్థ, న్యాయ వ్యవస్థ, కార్యనిర్వహణ వ్యవస్థ కచ్చితంగా పనిచేయాలి. ఈ వ్యవస్థల మధ్య సన్నని రేఖ మాత్రమే ఉంది. వాటి పరిధులు కూడా సక్రమంగా రాజ్యాంగ నిర్మాతలు నిర్వచించారు. కానీ ఆచరణలో కాల పరీక్షకు అవి ఎంతవరకూ నిలబడతాయి అన్నదే ఊహించలేకపోయారు. ఏ వ్యవస్థ అయినా నడిచేది మనుషులతోనే. మరి మనుషుల ఆలోచనలు, అభిప్రాయాలు మారుతున్నాయి. కాలంతో పాటుగా విలువలూ మారుతున్నాయి. దానికి తగినట్లుగా ఇపుడు వ్యవస్థల మధ్యన సన్నని రేఖ చెదిరిపోతోందని మేధావులు అంటున్నారు. రాజకీయ ఆధిపత్యం పెరిగిపోయిన వర్తమాన కాలంలో అంతా అదే శాసిస్తోంది. కార్యనిర్వహణ వ్యవస్థ మీద అయిదు దశాబ్దాల నుంచే నెమ్మదిగా ఆరోపణలు మొదలయ్యాయి. ఆ పట్టిన చెదలు ఇపుడు పెరిగి పెద్దవయ్యాయి. చిత్తశుద్ధితో పనిచేసే అధికారులకు స్థానం ఎక్కడ ఉందో ఎవరిని అడిగినా ఇట్టే చెబుతారు. ఈ నేపథ్యంలో స్వతంత్రంగా ఉండాల్సిన ఈ రెండు వ్యవస్థలు కలగాపులగం అయిపోతున్నాయి. ఇపుడు జనాలకు న్యాయ వ్యవస్థ మీదనే ఇంకా నమ్మకం ఉంది. దానికి పెంచిపోషించాల్సిన బాధ్యత అందరి మీదా ఉంది. ముందే చెప్పుకున్నట్లుగా శాసన వ్యవస్థలో తప్పు రాజ్యాంగ పరంగా జరిగితే దానిని సరిదిద్దాల్సిన బాధ్యత కచ్చితంగా న్యాయ వ్యవస్థ మీదనే ఉంది. అదే సమయంలో ప్రభుత్వ విధానాల మీద ప్రజలు డేగ కళ్లతో ఎపుడూ చూస్తుంటారు. ఈ దేశంలోని ఓటర్లలో ఇంకా నలభై శాతం నిరక్షరాస్యులే ఉన్నారు. అయినా వారు అయిదేళ్ళలో పాలన బాగులేకపోతే నిర్దాక్షిణ్యంగా మార్చేస్తారు. ఎవరు వత్తిడి కూడా వారి మీద పడదు, అదే ఇండియాలో బ్యూటీ ఆఫ్ డెమోక్రసీ. ఎంతటి పెద్దలైనా జనం ఓటు వేటుకు ఇంటికి వెళ్లాల్సిందే.

అందువల్ల ప్రభుత్వాలు ఏవైనా తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే ఎవరికీ ఎటువంటి చింత అవసరం లేదు. అదే సమయంలో అయిదేళ్ల పాటు పాలన చేయడానికి ప్రజలు ఒక పార్టీకి అధికారం ఇచ్చారన్నది ఎవరూ మరవరాదు. ఇవన్నీ ఇలా ఉంటే ఈ మధ్య కోర్టుల్లో వరసగా వైసీపీ సర్కార్ కి మొట్టికాయలు పడుతున్నాయి. దీని మీద వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ స్పందిస్తూ ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటాయి. వాటి విషయంలోనే కాదు, పాలనకు సంబంధించి దైనందిన వ్యవహారాల్లో ఏ వ్యవస్థ అధిక జోక్యం తగదని అంటున్నారు. తాము ప్రజలు ఎన్నుకుంటే అధికారంలోకి వచ్చామని, వారికే జవాబుదారీ అని ఆయన అంటున్నారు. మరి దీని మీద అంతా ఆలోచన చేయాలి. వ్యవస్థలను మనమే కాపాడుకోవాలి. రాజ్యాంగం నిర్వచించిన మేరకు ప్రతీ వ్యవస్థ తన విధులను ప్రజల కోసం నిర్వహించాలి. అపుడే సన్నని గీత చెదిరిపోకుండా ఉంటుంది.

## ఇబ్బందులు పడుతున్న ఆ సామాజిక వర్గం

ఏలూరు,అక్టోబరు 11, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అంటేనే కమ్మ సామాజిక వర్గం ఆధిపత్యం.. ఆ వర్గానికి ఈ పార్టీ పెట్టని కోట. పార్టీ ఆవిర్భావం నుంచి గత ఐదేళ్లు అధికారంలో ఉన్నంత వరకు ఈ వర్గం పార్టీలో మామూలుగా హవా చెలాయించలేదు. ఎన్నో ఇబ్బందులు, ఆటుపోట్లు వచ్చినా కమ్మ వర్గం మాత్రం పార్టీపై ఎంతో నమ్మకంతో ఉండేది. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడే రాష్ట్రం అంతా అప్పటికే విస్తరించి ఉన్న కమ్మ వర్గం టీడీపీ నుంచి సీట్లు దక్కించుకుని రాజకీయంగా తిరుగులేని శక్తిగా ఎదిగింది. ఉదాహరణకు ఎక్కడో శ్రీకాకుళం జిల్లా చివర్లో ఇచ్ఛాపురం నుంచి కృష్ణారావు, విజయనగరం జిల్లా చీపురుపల్లిలో గద్దె బాబూరావు, విశాఖలో ఎంవీవీఎస్. మూర్తి, తూర్పుగోదావరి జిల్లాలో బొడ్డు భాస్కర రామారావు, బుచ్చయ్య చౌదరి లాంటి వాళ్లు పాగా వేశారు. కమ్మ వర్గం ప్రాబల్యం లేని చోట్ల కూడా ఆ వర్గం నేతలు ఎమ్మెల్యేలు అయ్యారు. అటు తెలంగాణలో నిజామాబాద్ లాంటి చోట్ల మండవ వెంకటేశ్వరరావు, నేరెళ్ల ఆంజనేయులు మంత్రులు అయ్యారు. వరంగల్ లాంటి చోట్ల కూడా ఈ వర్గం వారు టీడీపీ నుంచి ఎమ్మెల్యేలు అయ్యారు. పార్టీ పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఈ వర్గం చాలా స్ట్రాంగ్‌గా ఉంటూ టీడీపీ కోసం గట్టిగా పని చేసింది. ఇక సీమలోనూ పరిటాల, పయ్యావుల నుంచి కర్నూలులో రాంభూపాల్ చౌదరి, మీనాక్షి నాయుడు, తిరుపతిలో గాలి ముద్దుకృష్ణమనాయుడు, కడపలో కస్తూరి విశ్వనాథనాయుడు ఇలా చాలా మంది కమ్మ నేతలు ఎక్కడిక్కడ పరుచుకుపోయి రాజకీయంగా బలమైన శక్తులుగా మారిపోయారు. అలాంటి కమ్మ వర్గం ఏపీలో అధికారం కోల్పోయిన ఈ యేడాదిన్నర కాలంలోనే ఎంతో గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది అన్నది వాస్తవం. ఈ వర్గం ఆందోళనతో ఉందా ? లేదా ? అన్ని రంగాల్లో టార్గెట్ చేయబడుతోందా ? అన్నది పక్కన పెడితే ఎప్పుడూ లేనంత అభద్రతా భావంతో ఈ వర్గం నేతలు ఉన్నారన్నది స్పష్టంగా తెలుస్తోంది. తమ వర్గానికి భవిష్యత్తులో సరైన నేత లేడన్న సందేహంతో కూడా చాలా మంది ఈ వర్గం నేతలు ఎవరి దారి వారు వెతుక్కుంటున్నారు. ఉదాహరణకు టీడీపీకి గత ఎన్నికల్లో కేవలం 23 సీట్లు వస్తే అందులో 11 మంది కమ్మలే ఉన్నారు. గెలిచిన ముగ్గురు ఎంపీల్లోనూ ఇద్దరు కమ్మ ఎంపీలే. కరణం బలరాం, వంశీ పార్టీ మారి చంద్రబాబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారు. ఇక మిగిలిన కమ్మ ఎమ్మెల్యేల్లో పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవి లాంటి వారిపై అనేక సందేహాలు ఉన్నాయి. ఎంపీల్లో నాని, జయదేవ్ ఇద్దరూ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో ? తెలియని పరిస్థితి. ఇక వీరితో పాటు ఈ వర్గానికే చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ పుట్టినప్పటి నుంచి టీడీపీలో ఉన్న కీలక నేతలు సైతం ఇప్పుడు టీడీపీని / చంద్రబాబును నమ్ముకుని రాజకీయం చేయలేమన్న నిర్ణయానికి వచ్చేశారు.

అందుకే ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు ఎక్కడెక్కడో ఉన్న ఈ వర్గం నేతలు ఇప్పుడు బయటకు వస్తున్నారు. తాజాగా విజయనగరం జిల్లాలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు పార్టీకి గుడ్ బై చెప్పేశారు. ఇప్పుడు పశ్చిమగోదావరి జిల్లాలో మాజీ కేంద్ర మంత్రి వారసుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బోళ్ల రాజీవ్ సైతం పార్టీ వీడేందుకు రెడీ అవుతున్నారు. రాజీవ్ రేపో మాపో వైసీపీ కండువా కప్పుకోనున్నారు. రాజకీయ భవిష్యత్తు కావొచ్చు, పారిశ్రామిక అవసరాల నేపథ్యం కావొచ్చు.. పార్టీ మారే వారి లిస్టులో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన కమ్మ నేతల పేర్లు ఎక్కువగానే తెరమీదకు వస్తున్నాయి. ఇక పశ్చిమ గోదావరి జిల్లాకే చెందిన మరో మాజీ మంత్రి మాగంటి బాబు కూడా బాబుకు, టీడీపీకి రాం రాం చెప్పనున్నారంటున్నారు. ఆయన పార్టీ మార్పుకోసం సరైన ముహూర్తం రెడీ చేసుకుంటున్నారట. ఇక గుంటూరు జిల్లాలో ఎన్నో యేళ్లుగా కీలక నేతగా ఉన్న ఓ మాజీ ఎమ్మెల్యే కూడా పార్టీ మారేందుకు చర్చలు జరుపుతున్నారని టాక్..? ఇక జగన్ సైతం కమ్మ వర్గంలో ఏ నేత ఊగిసలాటలో ఉన్నా వారిని వెంటనే పార్టీలోకి తీసుకువచ్చే బాధ్యతలను సైతం తమ పార్టీలో ఉన్న అదే వర్గం నేతలకు అప్పగించేశారట. దీంతో వీరంతా తమ ఉనికి కోసం ఇప్పటి వరకు ఉన్న కులం ముసుగును తెంపేసుకుని? టీడీపీతో బంధం వదులుకుంటోన్న పరిస్థితి.

## పేద్ద... రైలు

విజయవాడ, అక్టోబరు 11, (న్యూస్ పల్స్)సరుకు రవాణ చేసే గూడ్స్ రైళ్లు మహా అయితే 50 నుంచి 80 బోగీలు ఉంటాయి. ఇండియన్ రైల్వేలకు సరుకు రవాణా ద్వారానే అధిక మొత్తంలో ఆదాయం వస్తుంది. అయితే, ఎక్కువ గూడ్స్ రైళ్లను నడపడం వలన ప్రజా రవాణా రైళ్లకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఈ ఇబ్బందులను తొలగించేందుకు ఇండియన్ రైల్వే వ్యవస్థ అనేక ప్రయోగాలు చేస్తున్నది. ఇందులో భాగంగానే 176 బోగీలు, 6 రైలు ఇంజన్లతో కూడిన త్రిశూల్ రైలును తయారు చేసింది. ఇది పూర్తిగా సరుకు రవాణా కోసం రూపొందించిన రైలు. దాదాపు 2.40 కిలో మీటర్ల పొడవైన ఈ రైలు ముందు భాగంలో రెండు ఇంజన్లు, మధ్యలో రెండు ఇంజన్లు, చివర రెండు ఇంజన్లు వినియోగించి ప్రయోగాత్మకంగా నడిపించారు. గంటకు 50 కిలోమీటర్లతో ఈ రైలు దూసుకుపోయింది. విజయవాడ నుంచి సౌత్ సెంట్రల్ రైల్వే చివరి అంచు దువ్వాడ వరకు రైలును నడిపించారు. ఈ త్రిశూల్ రైలుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. మూడు రైళ్ల కోసం వినియోగించే సిబ్బందిని ఒక్క రైలుకు ఉపయోగించవచ్చు. అంతేకాకుండా, ఎక్కువ మొత్తంలో డిమాండ్ ఉన్న సరుకులను ఈ రైళ్ల ద్వారా సరఫరా చేయవచ్చు. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో త్వరలోనే దేశవ్యాప్తంగా ఈ త్రిశూల్ రైళ్లు అందుబాటులోకి తీసుకురానున్నారు.

## గంగ పుత్రుల పంట పండింది

శ్రీకాకుళం, అక్టోబరు 11, (న్యూస్ పల్స్)సిక్కోలు తీరంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు చేపల పంట పండింది. వేటకు వెళ్లిన ప్రతి ఒక్క మత్స్యకారుడి వలకు లక్షల రూపాయలు విలువ చేసే చేపల్లో రారాజుగా చెప్పుకునే కోనాం చేపలు వలకు చిక్కడంతో ఆ గ్రామంలో ఎక్కడ చూసినా కళ్లు చెదిరే చేపలు దర్శనం ఇచ్చాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇక్కడ కుప్పలు తెప్పలుగా పోగులు వేసి వున్న ఈ పొడుగైన చేపలు చూస్తుంటే మార్కెట్ లో విక్రయానికి పేర్చినట్లు వున్నాయి కదా? అలా అనుకుంటే పొరపాటే.. ఇంత పెద్ద మొత్తంలో చేపల వేట ఈ రోజు శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలం, ఏకువూరు రేవులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఇంత పెద్ద మొత్తంలో చేపల పంట పడిందిచాలా రోజులు తరువాత కొనాం చేపలు ఇంత పెద్ద మొత్తంలో చిక్కడంతో మత్స్యకారుల ఆనందానికి అవదులు లేకుండా పోయాయని మత్స్యకారులు అంటున్నారు. ఇలా ఈ రోజు వేటకు వెళ్లిన అందరి మత్స్యకారులకు పడిన ఈ కోనాం చేపల ఖరీదు సుమారు 50 లక్షలు విలువ చేస్తుందని వారు అంచనా వేస్తున్నారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో చేపల వలకు చిక్కిందన్న ఆనందం కంటే, పట్టు బడిన ఈ చేపలు అమ్ముడు పోవడం లేదన్న దిగులు తమను వెంటాడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేట ఫలించినా, ఆ చేపలకు తగిన గిట్టుబాటు ధర వచ్చేంత వరకూ నిల్వ చేసి అమ్ముకునేందుకు తగిన కోల్డు స్టోరేజ్ సౌకర్యం లేక పోవడంతో కోనాం చేప కిలో ఏడు వందల నుంచి వెయ్యి రూపాయల ధర పలుకుతున్న ఈ రోజుల్లో ఈ రోజు దొరికిన చేపలను కిలో నాలుగు వందలకు తెగనమ్ముకోవాల్సి వచ్చిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అనంతలో పై పైకి పాతాళ గంగ

అనంతపురం,అక్టోబరు 11, (న్యూస్ పల్స్)మన రాష్ట్రంలోని ఒక్క అనంతపురం జిల్లాలోనే లక్ష పంట కుంటలు తవ్వి, దేశానికి ఆదర్శంగా నిలిచేలా చేసారు. ఒకప్పుడు అనంతపురం అంటే, కరవుకు నిదర్శనంలా నిలిచే ప్రాంతం. తీవ్ర వర్షాభావం. 500 అడుగుల లోతు బోరు వేసినా చుక్క నీరు పడని పరిస్థితి. కానీ, ఇలాంటి ప్రదేశంలో పాతాళ గంగ పై పైకి వస్తుంది. జిల్లాలో వ్యవసాయ భూముల్లో నీటిని నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో భాగంగా పంట కుంటలు తవ్విస్తున్నారు. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే ఈ జిల్లాలో పడిన ప్రతి వాన చినుకునూ ఒడిసిపట్టి భూమిలోకి ఇంకించే ప్రయత్నం చేస్తుండడంతో, అనంతపురానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. జిల్లాలో 'లక్ష' పంట సంజీవని సేద్యపు కుంటలు నిర్మించి రికార్డు సొంతం చేసుకుంది. సోమవారం నాటికి 1,00,405 కుంటలు తవ్వడం పూర్తయింది. నాలుగేళ్లలో ఈ ఘనత సాధించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో నాలుగేళ్లల్లో 5,81,898 కుంటలను తవ్వారు. ఇందుకు రూ. 2,225.5 కోట్లు వెచ్చించారు. 94 వేల కుంటలతో చిత్తూరు జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. సామాజిక ఉద్యమంలా మొదలై సేద్యపు కుంటల తవ్వకం 2015–16 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో సామాజిక ఉద్యమంలా ఆరంభమైంది. ప్రతి రైతు తమ పొలంలో కుంటను తవ్వుకునేలా చైతన్యం కల్పించారు. జిల్లాలో తొలి ఏడాది 2,075 కుంటలను తవ్వారు. 2016–17లో అప్పటి కలెక్టర్ కోన శశిధర్, పీడీ నాగభూషణం ప్రత్యేక దృష్టి సారించారు. ఆ ఏడాదే 54,272 సేద్యపు కుంటలు తవ్వించి రికార్డు నెలకొల్పారు. 2017–18లో 25,790 కుంటలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 18,268 కుంటలు పూర్తి చేసి.. లక్ష కుంటలు తవ్వాలన్న లక్ష్యాన్ని సాధించారు.

## జాతీయ రహదారిపై జోరుగా వ్యభిచారం

గుంటూరు, అక్టోబరు 11, (న్యూస్ పల్స్)హైవే పై వ్యభిచారం. నడింపాలెం జాతీయ రహదారిపై జోరుగా వ్యభిచారం. నిర్భయంగా రోడ్డుపై నిలబడి తళుకు బెళుకులతో విటులకు గాలం. రాత్రయితే చాలు, ఆ హైవేపై ఇదే తంతు. పట్టించుకోని అధికారులు. ఈ వ్యభిచార బాగోతం అంతా ఏ మారుమూల గ్రామాల్లో జరుగుతున్న తంతు కాదు. గుంటూరు అర్బన్ పోలీస్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో. జాతీయ రహదారిపై. ప్రత్తిపాడు మండలం నడింపాలెం ? యనమదల మధ్య హైవే పై ఈ వ్యభిచార బాగోతం జంకూబొంకూ లేకుండా యథేచ్ఛగా జరుగుతుంది. ఈ ప్రాంతంలో ఇంజినీరింగ్ కళాశాలలు, వసతి గృహాలు, పెద్ద పెద్ద ఆస్పత్రులు, వందల సంఖ్యలో రకరకాల మిల్లులు ఉండటంతో విటుల కోసం వల వేస్తున్నారు. ఇదేదో రహస్యంగానో లేక గుట్టుచప్పుడు కాకుండానో జరుగుతుందనుకుంటే పొరబాటే. అంతా బహిరంగంగానే. విటులకు వల వేయడం మొదలు, కవ్వింపులు, బేరసారాలు , (?? )అన్నీ అక్కడే నడి రోడ్డు పైనే. ఇంతా జరుగుతున్నా ఎవ్వరూ ఇదేమని నోరు మెదపరు. నిలువరించే ప్రయత్నమూ చెయ్యరు. పొట్టకూటి కోసం పడుపు వృత్తిని ఎంచుకున్న వారి సంగతి అటుంచితే.. అక్కడ ఆగి బేరమాడే వారిలో మద్యం సేవించినవారు, రకరకాల వ్యక్తులు ఉంటున్నారు. పొరబాటున మద్యం మత్తులో ఎవ్వరైనా దారుణాలకు ఒడిగడితే .? ఎవరిది బాధ్యత.? అని మదన పడుతున్నారు ఆ ప్రాంత ప్రజలు.

## సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి వెలంపల్లి

విజయవాడ అక్టోబరు 11, (న్యూస్ పల్స్)ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాల్లో భాగాంగా మూలానక్షత్రం రోజున ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి. ఈ నేపథ్యంలో సోమవారం నాడు దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అధికారుల తో కలసి ఏర్పాట్లు పరిశీలించారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని దేవదాయ శాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు. సీఎంతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులకు దేవదాయ శాఖ తరఫున స్వాగతం పలికి చినరాజగోపురం నుంచి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాల సమర్పణ, అంతరాలయంలో పూజలు, అనంతరం వేదపండితుల ఆశీర్వచనం కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రికి పూర్ణకుంభ స్వాగత ఏర్పాట్లు చేయాలని ఈవోకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

# కమలానికి ఆశలు గల్లంతేనా



విజయవాడ, అక్టోబరు 11, (న్యూస్ పల్స్)బీజేపీ హైకమాండ్ ఆశలు వదిలేసుకుందా? తెలంగాణకు ఇచ్చిన ప్రాధాన్యతలో ఒక్కశాతం కూడా ఏపీకి ఎందుకు ఇవ్వడంలేదు? ఎంత చేసినా అక్కడ నుంచి అంతకు మించి వచ్చేది ఏమీలేదని డిసైడ్ అయ్యిందా? లేక పదవులు పొందేస్థాయి ఉన్న నేతలెవరూ లేరనా? పదవుల పందేరంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆరో వేలిలా చూస్తోంది అందుకేనా?ఏపీ బీజేపీ శాఖను ఆ పార్టీ హైకమాండ్ లైట్ తీసుకుంటున్నట్లుంది. పార్టీ పదవులు, ప్రభుత్వ పదవుల్లో రాష్ట్రానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని చూస్తే అదే అవుతుంది. పక్కన ఉన్న తెలంగాణకు విపరీతమైన ప్రయార్టీ ఇస్తోంది బీజేపీ జాతీయ నాయకత్వం. అదే సమయంలో ఏపీకి తూతూ మంత్రంగా ఒకటీ అరా పదవులు విదిలిస్తోంది. 80 మంది సభ్యులతో జాతీయ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ హైకమాండ్ మరో 50 మంది నేతలకు ప్రత్యేక ఆహ్వానితులుగా పదవులు అప్పగించింది. ఈ రెండు పదవుల్లో ఏపీకి దక్కింది ఒక్కటంటే ఒక్కటే. అందులో కనీసం గతంలో ఉన్నట్లుగా ఇద్దరికి కూడా అవకాశం ఇవ్వలేదు. గతంలో ఏపీ నుంచి సోము వీర్రాజు, కంభంపాటి హరిబాబు జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఉండేవారు. హరిబాబు గవర్నర్‌గా వెళ్లారు. వీర్రాజు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆ ఇద్దరికి బదులు మరో ఇద్దరికి ఛాన్స్ వస్తుందని నిన్నటి వరకు నేతలు ఆశించారుబీజేపీ హైకమాండ్? కన్నా లక్ష్మీనారాయణ ఒక్కరినే జాతీయ కార్యవర్గంలోకి తీసుకుంది. ఏపీ నుంచే కామర్సు బాలసుబ్రహ్మణ్యాన్ని పార్లమెంటరీ పార్టీ ఆఫీస్ సెక్రటరీగా చోటు ఇచ్చినా? ఆయన ఎప్పుడూ రాష్ట్ర పార్టీ కార్యకలాపాల్లో ఉందరు. ఆయనదంతా ఢిల్లీ లెవల్. అదే సమయంలో తెలంగాణలో ఒకేసారి నలుగురికి కార్యవర్గంలోకి చోటుకల్పించింది. అంతేకాదు.. విజయశాంతికి ప్రత్యేక ఆహ్వానితురాలిగా అవకాశం ఇచ్చారు. అంతకు ముందు కూడా డి.కె. అరుణను జాతీయ ఉపాధ్యక్షురాలిగా పదవి ఇచ్చి? ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడిగా డాక్టర్ కె. లక్ష్మణ్ ను నియమించారు. అప్పుడు పురందేశ్వరిని ఏపీ నుంచి ప్రధాన కార్యదర్శిగా తీసుకున్నారు. సత్యకుమార్‌ను జాతీయ కార్యదర్శిని చేశారు. టీడీపీ అధికారం కోల్పోగానే జెండా తీప్పేసిన ఎంపీలు సుజనా చౌదరి, టీ.జీ. వెంకటేష్, సి.ఎం. రమేష్‌లకు ఏ పదవి ఇవ్వట్లేదు. వాళ్లు పార్టీని పట్టించుకోవడం లేదో? వాళ్లనే పార్టీ లైట్ తీసుకుందో ఏమో కానీ.. మాజీ ఎంపీ అయిన గరికపాటి రామ్మోహనరావుకు జాతీయ కార్యవర్గంలో చోటిచ్చింది. ఏపీలో ఎంపీలుగా ఉన్న ఈ ముగ్గురికీ అవకాశం ఇవ్వలేదు. పేరుకు యూపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నా? కార్యకలాపాలన్నీ ఏపీ నుంచి నిర్వహిస్తున్న జీవీఎల్ నరసింహారావుకు ఉన్న జాతీయ అధికార ప్రతినిధి హోదానూ పీకేశారు. ఏపీలో ఎంత చేసినా? ఎన్ని పదవులు ఇచ్చినా ఎదుగూబొదుగూ ఉండదనే హైకమాండ్ పట్టించుకోవడం లేదట. జాతీయ పార్టీలో పదవులు చేపట్టేంత స్ట్రేచర్ ఉన్నోళ్లు కూడా మా రాష్ట్రంలో ఉండాలి కదా? అని సెటైర్ వేశారు ఓ నాయకుడు. ఇంకో నాయకుడు అయితే? హైకమాండ్ చేసిన దాంట్లో తప్పేమీలేదని తేల్చేశారు. మరి పార్టీ నాయకత్వం అంతా అదే ఫీల్ లో ఉందో ఏమో? మాకెందుకు పదవులు ఇవ్వడం లేదు అని గొంతు విప్పలేకపోతున్నారు.

# పొగడ్తలువద్దు.. విమర్శలు చేయండి..

## మీడియాకు సీఎం తమిళనాడు సీఎం స్టాలిన్ ఆదేశాలు !

చెన్నయ్ అక్టోబర్ 11 తమిళనాడు సీఎం స్టాలిన్ ఎన్నిక తర్వాత ఆ రాష్ట్రంలో అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో ఆ రాష్ట్ర నెటిజన్లతో పాటు ప్రజల్లో మంచి క్రేజ్ సంపాదించారు. స్టాలిన్ పరిపాలనలో కొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నారు అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా ఒక ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలను ఆ ఫోటోలను కూడా ప్రస్తుత ముఖ్యమంత్రులు వాటిని కొనసాగించకపోవడం లేదంటే వాటి మీద తమ ఫోటోలను పెట్టి ప్రచారం చేసుకుంటారు. గత ప్రభుత్వాలు తీసుకున్న ఏ పథకాన్నైనా తమ స్వంత పథకంగా ప్రచారం చేసుకుంటారు. ఈ అయితే స్టాలిన్ మాత్రం ఇలా చేయలేదు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ జయలలిత ఫోటోలను స్కూల్ బ్యాగుల పై అలాగే ఉంచి పంపిణీ చేశారు. గతంలో ప్రింట్ చేసిన బ్యాగుల పై జయలలిత ఫోటోను తొలగించకుండా చేసి రాష్ట్ర ఖజానాపై భారం పడకుండా చేశారు. మరోవైపు అమ్మ క్యాంటీన్లలో కూడా ఇదే విధంగా పాత సీఎం ఫోటోలు మార్చకుండా వాటిని కొనసాగించారు. ఈ క్రమంలోనే అసెంబ్లీలో ముఖ్యమంత్రిని పొగుడుతున్న సొంత పార్టీ ఎమ్మెల్యేలను సున్నితంగా హెచ్చరించారు. ఇంకోసారి రిపీట్ కావద్దని చెప్పారు. దీని ద్వారా అసెంబ్లీలో సమయం వృధా అవడం తప్ప ప్రయోజనం లేదని సున్నితంగా మందలించారు. ఇదే తరుణంలో తాజాగా మీడియా కి కూడా ఓ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తే విధంగా వార్తలు కథనాలు ప్రచురించాలని తాను ఎన్నడూ ఆదేశించలేదని ప్రభుత్వ పథకాల్లో లోటుపాట్లు విమర్శలు ఉంటే ఎత్తి చూపించాలని వాటిని సరి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ ఊహించని వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రముఖ ఆంగ్ల పత్రిక నేతృత్వంలో ఆదివారం చెన్నైలో జరిగిన కార్యక్రమానికి సీఎం ఎంకే స్టాలిన్ హాజరయ్యారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఎన్నో పథకాలు అమల్లోకి తీసుకొచ్చామని పారిశ్రామిక రంగానికి పునర్జీవం పోశామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని పారిశ్రామిక ఎగుమతుల్లో తమిళనాడు మూడో స్థానంలో నిలిచినట్టు గుర్తు చేశారు. తమిళనాడు పారిశ్రామిక పెట్టుబడులకు నెలవు అని ఇక్కడ అన్ని రకాల వసతులు అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ పథకాలు తమ పనితీరును పొగడ్తలతో ముంచెత్తాలని తాను ఎన్నడూ మీడియాను ఆదేశించ లేదన్నారు. విమర్శలు ఎత్తి చూపించాలని వాటిని సరి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్రం రూ. 5 లక్షల కోట్ల అప్పుల్లో ఉందన్నారు. అలాగే రూ. 2 లక్షల కోట్లు పబ్లిక్ రంగ సంస్థలు సైతం అప్పుల్లో ఉన్నట్టు వివరించారు. నిధుల సమీకరణకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్టు వెల్లడించారు.

# రావులపాలెంలో కాపు నేతల భేటీ

రావులపాలెం అక్టోబరు 11, (న్యూస్ పల్కాపు, తెలగ, బలిజ, ఒంటరివారు పెద్దన్నపాత్ర పోషిస్తేనే మార్పు సాధ్యమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆ సామాజికవర్గంలో విస్తృత చర్చ జరుగుతోంది. అందరూ తన వెనకు నడిస్తేనే సాధ్యమవుతుందన్న పవన్ కల్యాణ్ అభిప్రాయంతో ఎక్కువ మంది ఏకీభవిస్తున్నారు. ఆయనకు ఏకపక్షంగా మద్దతు ప్రకటించాలనే ఆలోచనలు చేస్తున్నారు. దీనికి సంబంధించి కాపు జేఏసీ పేరుతో ఓ సమావేశం తూర్పుగోదావరి జిల్లా రావుల పాలెంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముద్రగడ పద్మనాభం .. రిజర్వేషన్ ఉద్యమం చేపట్టినప్పుడు క్రియాశీలకంగా వ్యవహరించిన ఆకుల రామకృష్ణ నేతృత్వం వహించారు. ప్రస్తుతం కాపు సంఘాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో విజయవాడలో మరిన్ని సంఘాలతో విస్తృత సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. పవన్ కల్యాణ్‌ను కులం పేరుతో విమర్శించడం.. దానిపై పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించడం వంటి కారణాల వల్ల.. ఇప్పుడు ఈ సామాజికవర్గంలో ఓ కదలిక కనిపిస్తోంది. ప్రభుత్వంలో ఉన్న పెద్దనాయకులు, మంత్రులు కాపుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడి కులాన్ని చులకన చేస్తున్నారని అంటున్నారు. ఇక తాము నాయకత్వం వహించే సమయం వచ్చిందని వారు భావిస్తున్నారు. కాపు రిజర్వేషన్ల అంశాన్ని?మరోసారి తెరపైకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఇటీవల ఓబీసీ రిజర్వేషన్ బిల్లులో మార్పులు చేసింది. దీని ప్రకారం ఓబీసీల జాబితాలోకి ఇతర కులాల్ని ఆయా రాష్ట్రాలు చేర్చుకోవచ్చు.

ఈ అంశం ఆధారంగా కాపు రిజర్వేషన్ పోరాట సమితి నేతలు మళ్లీ కార్యక్రమాలు ప్రారంభించారు. కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకపోవడం.. దగ్గర్నుంచి అన్ని రకాల పథకాలు ఆగిపోవడం కూడా కాపుల్లో అసంతృప్తి కలిగిస్తోందని అంటున్నారు. ఎన్నికల వేడి పెరుగుతున్న సమయంలో.. కాపు సామాజికవర్గాన్ని తన పూర్తి స్థాయి మద్దతుదారులుగా మార్చుకునే ప్రయత్నంలో ఉన్న పవన్ కల్యాణ్‌కు మద్దతుగా వీరు త్వరలోనే తెర ముందు కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందంటున్నారు జేఏసీ నేత కుమార్.

# రెచ్చిపోతున్న బ్లేడ్ బ్యాచ్

విజయవాడఅక్టోబర్ 11విజయవాడ చిట్టి నగర్ సొరంగం రోడ్డులో ఒక బార్ లో బ్లేడ్ బ్యాచ్ ఆదివారం రాత్రి వీరంగం చేసింది. తాగిన మత్తులో అక్కడి బార్ లో అద్దాలు పగలగొట్టారు. బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను పోలీసులు నియంత్రించేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం సొరంగం రోడ్లో బ్లేడ్ బ్యాచ్,రౌడీషీటర్ ఆగడాలు జరుగుతూనే ఉంటాయని స్థానికులు అంటున్ఆనరు. ఆదివారం రాత్రి గొడవ సృష్టించిన బ్లేడ్ బ్యాచ్ సభ్యుని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సదరు బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాన్ని తన తలతో బలంగా గుద్దుకోవడంతో గాయాలపాలయ్యాడు. సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

# స్మశానం కబ్జా?గ్రామస్థుల అందోళన

చిత్తూరు అక్టోబరు 11, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మిట్టమీద కండ్రిగ గ్రామ స్మశానాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకున్నారంటూ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో మృతి చెందిన వృద్ధిరాలిని ఖననం చేసేందుకు వచ్చిన వారికి అడ్డుకోవడంతో ఉద్రిక్తత తలెత్తింది. ఈ క్రమంలో అక్కడకి చేరుకున్న అదికారులతో గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. స్మశాన సమస్యపై అదికారులు తక్షణమే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# మోహినీ అవతారంలో వెంకటేశ్వరుడు

తిరుమల అక్టోబరు 11, (న్యూస్ పల్స్)తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శ్రీవేంకటేశ్వరుడు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పక్కనే దంతపు పల్లకిపై కృష్ణుడి రూపంలోనూ అభయమిచ్చారు. శ్రీవారి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో ఈ వాహన సేవను నిర్వహించారు. పండితుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు స్వామివారికి కర్పూర, పూర్ణకుంభ హారతులు సమర్పించారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఆస్థానాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాయా జగత్తు నుంచి బయటపడేయటమే మోహినీ రూపం పరమార్థం అని భక్తులు విశ్వసిస్తారు. ఉత్సవాల్లో ప్రధాన వాహన సేవ అయిన గరుడ సేవను ఈ రోజు రాత్రి ఏడు గంటల నుంచి నిర్వహించనున్నారు. సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి సీఎం జగన్ పట్టు వస్త్రాలు సమర్పించి.. గరుడ సేవలో పాల్గొంటారు.

# రైతు మహా ధర్నాను విజయవంతం చేయాలి

## వామపక్షాల పార్టీల నేతల పిలుపు

కోరుట్ల అక్టోబర్ 11 ఈ నెల 12న జరిగే రైతు మహా ధర్నా ను విజయవంతం చేయాలని వామపక్షాల పార్టీల నేతలు పిలుపు నిచ్చారు. సోమవారం కోరుట్ల పట్టణంలోని ప్రభాకర్ భవన్ లో కామ్రేడ్ చెన్న విశ్వనాథం అధ్యక్షతన వామపక్షాల పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల పార్టీల నేతలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే వంద రోజుల లోపు షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని ఇచ్చిన హామీని నిలుపు కోవాలని అలాగే రైతులు సాగు చేసిన వరి,మక్కలు ధాన్యం కొనుగోలు యధావిధిగా కేంద్రాలను కొనసాగించాలని ఈ నెల 12 న తలపెట్టిన రైతు ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘాలు కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలు రైతులపై ప్రయత్నిస్తున్న తరుణంలో ఇలాంటి చట్టాలను వెంటనే ఉపసంహరించు కోవాలని కోరారు. రైతులు పండించిన వరి మక్కలు దాన్యం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని అని కోరారు .ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెన్న విశ్వనాథం , ఏఐటియూ సి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు, సిపిఎం నాయకులు తిరుపతి నాయక్, సిపిఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు చింత భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ వారియర్స్ నిరసన..ఆరెస్టు

విశాకపట్నం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విశాఖ కలక్టరేట్ వద్ద వంట వార్పు కోవిడ్ వారియర్స్ ను పోలీసులు అరెస్ట్ చేసారు. కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి వైద్యం చేస్తే విధుల నుండి అర్ధాంతరంగా తొలగించడం దారుణం అని ఇప్పటివరకు తమకు వేతనాలు కూడా చెలించలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో మ సేవలు అద్భుతం అని మేముచేసిన సేవలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కొనియాడారు అని ఈరోజు అందరిని రోడ్డున పడేశారు అంటూ ఆవేదన వ్యక్తంచేశారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోవిడ్ వారియర్స్ కి ఉద్యోగ భద్రత కల్పించాలి అని పెండింగ్ వేతనాలు వెంటనే రిలీజ్ చేసి అందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఈరోజు కలెక్టరేట్ వద్ద వంట వార్పు నిర్వహించి నినాదాలు చేస్తూ కలక్టర్ ఆఫీస్ ముట్టడికి ప్రయత్నించగా వారిని అడ్డుకొని పోలీసులు స్టేషన్కి తరలించారు కోవిడ్ వారియర్స్ కి ఉద్యోగ భద్రత కల్పించాలని పెండింగ్లో ఉన్న వారియర్స్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని కోవిడ్ విధుల్లో చనిపోయిన కోవిడ్ వారియర్స్ కి తక్షణమే నష్ట పరిహారం చెలించాలి అని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ లో కోవిడ్ వారియర్స్ కి ప్రాధాన్యత కల్పించాలి అని అమర్ ఏఐటీయూసీ అనుబంధం అయిన ఆంధ్ర మెడికల్ కోవిడ్ వారియర్స్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేశారు

# నీళ్ల కోసం అవస్తపడుతున్న చిన్న హరివనం, చిన్న గోనెహాల్ ప్రజలు

ఆదోని అక్టోబరు 11, (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లా ఆదోని మండలాల్లోని చిన్న హరివనం,, చిన్న గోనెహాల్,, గ్రామాల్లో మంచినీళ్లు లేక ప్రజలు ఇబ్బంది గురవుతున్నారు,, మంచినీళ్లు కావాలంటే ఎనిమిది రోజుల నుంచి పది రోజులలో ఒకసారి నీళ్లు రావడం అది కూడా ఫిల్టర్ లేని నీళ్లు రావడం తో గ్రామంలో చిన్న పిల్లల పరిస్థితి అది దారుణంగా మారిపోయింది తీరువ దెంగో,మలేరియా, లాంటి జ్వరాలతో ప్రజలు ఆస్పత్రికి పాలవుతున్నారు గ్రామంలో ఉన్న నీళ్ల ట్యాంక్ ను నెలకు ఒక్కసారైనా క్లీన్ చేయాలి కానీ ఇక్కడ సీన్ రివర్స్, చిన్న గోనెహాల్ చిన్నారి హరివాణం లో రెండు నుండి మూడు నెలలు అయినా నీళ్ల ట్యాంక్ ను శుభ్రం చేయలేని పరిస్థితి ఎంతైనా ఉంది.. చిన్న గోనెహాల్ లో ఊర్లో ఉన్న రోడ్లు గాని డ్రైనేజీ వ్యవస్థ అంత దారుణంగా మారిపోయింది ఊర్లో ఉన్న అనేక సమస్యలు పంచాయతీ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది అంటూ గ్రామ ప్రజలు వాపోయారు.. నీళ్ల సమస్య పై అధికారులకు ఫిర్యాదు చేసిన

## నీళ్ల దాహం తీర్చలేని పంచాయతీ సెక్రెటరీ

ప్రయోజనం లేకుండా ఉందని పంచాయతీ సెక్రెటరీ కి ఫోన్ చేసి సార్ ఊర్లో కల్తీ నీళ్లు వస్తుందని రెండు మూడు చోట్ల లీకేజ్ ప్రాబ్లం కూడా ఉందని అది మరమ్మత్తులు చేయండి సార్ అంటూ ఎన్నిసార్లు చెప్పినా ఆయనకి చీమకుట్టినట్లు కూడా లేదని,, పంచాయతీ సెక్రెటరీ మాటలు మాత్రం చేపిస్తాను అంటూ వెళ్లిపోతారని గ్రామ ప్రజలు తెలిపారు.. తాగునీటి ట్యాంకు పక్కనే ఉన్న వాల్ చుట్టుపక్కల గలీజ్ నీళ్లు నిలబడి ఆ నీటిలో పాములు,,తేలు,,కప్పలు,,ఆ నీరు ట్యాంక్ లోకి వెళ్ళిపోతుందని ఆ నీరే మేము ఎలా తాగాలని అలాంటి నీళ్లు తాగితే జ్వరాలు రావా అని ప్రజలు వాపోయారు... ఈ విషయంపై పంచాయతీ సెక్రెటరీ కు వివరణ అడిగా ఆయన మాటలు మాత్రం నేను ప్రతి పని చేపిస్తున్న అని సమాధానం ఇచ్చే జారుకుంటున్నారు. దీనిపై పై అధికారులు దృష్టి సాధించాలని సమస్యలు వెంటనే పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు..

# అంధకారంలో ఆంధ్రప్రదేశ్

గుంటూరు అక్టోబరు 11, (న్యూస్ పల్స్)కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆంధ్రప్రదేశ్ అంధకారంలోకి వెళ్లిందని, వచ్చే నెలలో అసలు రాష్ట్రంలో కరెంట్ కూడా ఉండదన్నారు. గుంటూరులో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అధానీ ప్రదేశ్‌గా మారిందని విమర్శించారు. ప్రతి ఆదివారం అధానీ తాడేపల్లి వచ్చి వెళ్తుంటారన్నారు. సీఎం జగన్ నవరత్నాలతో ప్రజల నవ రంధ్రాలు మూసి వేశారన్నారు. అసలు నవరత్నాలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు ఆగిపోయాయన్నారు. రైతు ఆత్మహత్యలతో పాటు విద్యార్థుల ఆత్మహత్యలు కూడా ప్రారంభమయ్యే పరిస్థితి ఉందన్నారు. నవంబర్ 1వ తేదీలోపు ప్రభుత్వం విద్యార్థుల స్కాలర్ షిప్‌లు చెల్లించాలని చింతా మోహన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ తెరవాలన్నారు. విశాఖ ప్రజలు రాజధాని అడగలేదని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఉండాలని కొరకుకుంటున్నారన్నారు. జగన్ రెడ్డిది డిల్లీలో ఓ మాట.. గల్లీలో మరో మాట మాట్లాడతారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలిరోజే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి విముక్తి కలిగిస్తామని చింతా మోహన్ అన్నారు.

# దేవరగట్టులో దసరా ఉత్సవాలు

కర్నూలు అక్టోబరు 11, (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ పరిధిలోని దేవరగట్టు లో నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇవాళ గణపతి పూజ, కంకణధారణ, నిశ్చితార్థం, ధ్వజారోహణం జరుగుతుంది. 15వ తేదీన స్వామివారి కల్యాణోత్సవం, బన్ని జైత్రయాత్ర, 16న ఉదయం నెరణికి గ్రామ ఆలయ పూజారి దైవవాణి, 17న ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేక పూజలు, సాయంత్రం రథోత్సవం, 18న గొరవయ్యల ఆట, గొలుసు తెంపే కార్యక్రమం, వసంతోత్సవం, సాయంత్రం కంకణ విసర్జన నిర్వహిస్తారు. 19వ తేదీన మాళ మల్లేశ్వరస్వామి విగ్రహాలు నెరణికి గ్రామం చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇటు మరోవైపు దసర రోజున దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుందామని జిల్లా కలెక్టరు కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం దేవరగట్టులో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొవిడ్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు 150 కంటే ఎక్కువ మంది గుమికూడకూడదన్న ఆంక్షలు ఉన్నాయని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్పీ సుధీర్కుమార్రెడ్డి మాట్లాడుతూ బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు గతేడాది కంటే ఎక్కువ మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మద్యం నియంత్రణ కోసం ఇప్పటికే నాటుసారా బట్టీలపై దాడులు చేపడుతున్నామన్నారు. ఎవరైనా మద్యం అమ్మినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# పేదల కోసమే... కేంద్రమే సర్కార్

న్యూఢిల్లీ, అక్టోబరు 11, (న్యూస్ పల్స్)2014 నుంచి ఇప్పటి వరకు భారత ప్రధాన మంత్రిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటూ పాలన సాగిస్తున్నారు పీఎం నరేంద్ర మోదీ. తన విభిన్న శైలితో యావత్ దేశ ప్రజానికాన్నే కాక.. ప్రపంచ దేశాలను సైతం తన వైపునకు తిప్పుకుంటున్నారు. అయితే, ప్రధాని మోదీ నియంతృత్వ ధోరణి కలిగి ఉంటారని విపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతుంటాయి. కేంద్ర మంత్రులను, అధికార యంత్రాంగాన్ని మొత్తం తన గ్రిప్‌లో పెట్టుకుని.. ఏకపక్షంగా వ్యవహరిస్తారని అంటుంటారు. అయితే, ఇదే అంశంపై తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా వద్ద ప్రశ్న లేవనెత్తారు ఓ జాతీయ మీడియా ప్రతినిధి. దీనికి ఆయన చాలా ఆసక్తికరమైన రిప్లై ఇచ్చారు. అంతేకాదు.. ప్రధాని మోదీకి సంబంధించి ఇంట్రస్టింగ్ విషయాలను పంచుకున్నారుప్రధాని మోదీ నిరంకుశ పద్ధతిలో నిర్ణయం తీసుకుంటారా? అని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. "మోదీ లాంటి శ్రోత ను నేనెప్పుడూ చూడలేదు. ఏ సమావేశంలో అయినా ఆయన అతి తక్కువ మాట్లాడుతారు. ప్రతీ ఒక్కరు మాట్లాడేది ఓపిగా వింటారు. విషయ పరిజ్ఞానం ఆధారంగా ప్రతి వ్యక్తి సూచనలకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తారు." అని తాజాగా జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ..గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్లు, భారత ప్రధానిగా 7 ఏళ్లు, మొత్తం 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా జాతీయ మీడియాతో ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ప్రధాని మోదీపై మోపని నిందంటూ లేదు. కానీ, ఆయన అన్నింటినీ అధిగమించారు. ప్రతిపక్షాలే ప్రధాని మోదీని మరింత బలవంతుడిని చేస్తాయని ఆయన భావన. ప్రజల పట్ల ఆయనకు అపార విశ్వాసం ఉంది. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా దేశం కోసమే అని ప్రజలకు బాగా తెలుసు. ఈ నిర్ణయాల వల్లే దేశానికే ఉపయోగం తప్ప.. ఆయనకు ఎలాంటి ప్రయోజనం లేదు. అందుకే కొన్ని విషయాల్లో పొరపాట్లు జరిగినా..ప్రజలు తమను క్షమించారు." అని అమిత్ షా తెలిపారు. భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ఏ భారతీయ ప్రధాన మంత్రి కూడా చెప్పలేదు. ఈ రోజు మన ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉంది. త్వరలోనే 5వ స్థానానికి చేరుకుంటుంది. భారత్ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందనే నమ్మకం నాకు ఉంది." అని అమిత్ షా పేర్కొన్నారు. ఇంకా ఏమన్నారంటే.. "ప్రధాని మోదీ రాజకీయ జీవితాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. మొదటి భాగంలో ఆయన ప్రారంభ రోజులు. రెండవది, గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేసిన కాలం. మూడవది, జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించడం. మోడీ..

తన అకుంఠిత శ్రమ, వ్యూహాత్మక విధానాలతో, పకడ్బందీ కార్యాచరణ అమలు చేయడం ద్వారా గుజరాత్‌లో బీజేపీని బలోపేతం చేశారు. ఇక భారత ప్రధానిగా నరేంద్ర మోదీ.. గత ఏడు సంవత్సరాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, సంస్కరణలు తీసుకువచ్చారని అమిత్ షా పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్థిక సంస్కరణలకు సంబంధించి ప్రధాని మోదీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇదే సమయంలో రైతు ఉద్యమంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక కామెంట్స్ చేశారు. రైతుల నిరసనలు, ఆందోళనలు అర్థం లేనివి అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు చట్టాలు రైతులకు మేలు చేసేవే తప్ప.. హానీ తలపెట్టవని స్పష్టం చేశారు. వామపక్ష భావజాలం పేదల సంక్షేమం కోసం కాదని, అధికారాన్ని చేజిక్కించుకోవడానికి.. పేదల ఆగ్రహాన్ని క్యాపిటలైజ్ చేయడానికి ఇది ఒక మార్గం అని విమర్శించారు. వామపక్ష పాలిత రాష్ట్రాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసునని అమిత్ షా వ్యాఖ్యానించారు.

# తుంగభద్రకు వరద ప్రవాహం

కర్నూలు అక్టోబరు 11, (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లాలో తుంగ భద్ర నదికి గత రెండు రోజులుగా వరద ప్రవాహం కొనసాగుతోంది. జిల్లాలో కురిసిన వర్షానికి సుంకేసుల ప్రాజెక్టుకు 76,970 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దింతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై 12 గేట్ల ద్వారా 75,720 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అలాగే కేసీ కాల్వకు 1,450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇదే ప్రవాహం మరో రెండు మూడు రోజులు ఉండే అవకాశముంటుందని అంచనా వేస్తున్నారు. కేసీ ఆయకట్టు పంటలకు నీటి విడుదల కొనసాగుతుందని కేసి అధికారులు తెలిపారు. . సుంకేసులకు భారీగా వరద నీరు వస్తుండటంతో సిబ్బందిని అప్రమత్తం చేశామని అధికారులు చెప్పారు.

# ఇంటి స్థలం అడిగినందుకు దాడి చేసారు

తణుకు అక్టోబరు 11, (న్యూస్ పల్స్)పశ్చిమ గోదావరి జిల్లా తేతలి గ్రామంలో దారుణం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇంటి స్థలం అడిగినందుకు యువకుడిపై వైసీపీ నాయకుల దాడికి దిగారు. తేతలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆటో నడుపుకునే సతీశ్ అనే వ్యక్తి ఇంటి స్థలం కావాలని అయనను అభ్యర్థించారు. అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అయితే ఆ కార్యక్రమం ముగిశాక సతీశ్ పై వైసీపీ నాయకులు కుర్చీలతో దాడి చేసారు. దాడిలో సతీష్ చేతికి, తలకు గాయాలు కావడంతో తణుకు ఆస్పత్రికి తరలించారు. సతీష్ స్టేట్ మెంట్ మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు అంటున్నారు.

# పాఠశాలలో వేడుకగా విజయదశమి వేడుకలు

అనంతపురం అక్టోబరు 11, (న్యూస్ పల్స్) దుష్ట రాక్షసుడు మహిషాసురున్ని, దుర్గాదేవి సంహరించి ప్రజలందరికీ రక్షణగా నిలిచిందని, అలాగే చెడుపై మంచి విజయాన్ని సాధించినందుకే , ప్రతియేటా అక్టోబర్ మాసంలో విజయదశమి పండుగను ఘనంగా జరుపుకుంటారని, గోల్డెన్ బెల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ జాన్ పీటర్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం పట్టణములోని గోల్డెన్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, విజయదశమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు .ఈ సందర్భంగా దుర్గాదేవి పూజ తో పాటు, బొమ్మలకొలువు నిర్వహించి, విద్యార్థులకు విజయదశమి పండుగ విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జాన్ పీటర్ మాట్లాడుతూ, అజ్ఞానమనే దుష్ట రాక్షసుణ్ణి, విజ్ఞానమనే ఆయుధంతో సంహరించి, ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, విద్యార్థులు ప్రదర్శించిన, మహిషాసుర మర్దిని నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది

## దోమల బెడద నివారించాలని సీపీఐ పట్టణ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ కు వినతి

ఎమ్మిగనూరు అక్టోబరు 11,( విభారె) -ఎమ్మిగనూరు పట్టణ పరిధిలోని మునిసిపాలిటీ నందు 34 వార్డుల్లో దోమల బెడద నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనరు కృష్ణకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భముగా సీపీఐ పట్టణ కార్యదర్శి



తిమ్మగురుడు,, రైతు సంఘము జిల్లా సహాయకార్యదర్శి ఎమ్.సత్యన్న లు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణ పరిధిలోని 34 వార్డులలో దోమల బెడదతో ప్రజలు వృద్దులు,చిన్నారులు,తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని,దోమల బారిన పడి వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు అవుతున్నారని,మలేరియా,డెంగ్యూ లక్షనాలు,రక్త కణాలు తగ్గిపోవడం దోమకాట్ల నివారణకు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి,దోమలపై మందు పిచికారి బ్లీచింగ్ పౌడర్ చెల్లించేందుకు డ్రైనేజి కాలువల్లో వెస్ట్ ఆయిల్ బాల్స్ వేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బాలరాజ్ ,కేసి.జబ్బార్,మాధవ్,ఖాజా, ఏఐఎస్ఎఫ్ నాయకులు రామాంజనేయులు, మునిస్వామి,గోపాల్,పార్థసారథి నాయుడు,అంజి,తదితరులు పాల్గొన్నారు,

## ఆదోనిలో సజావుగా సాగిన స్పందన కార్యక్రమం

ఆదోని అక్టోబరు 11,( విభారె) -కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని ఆర్డీవో,,ఎం.ఆర్.ఓ. కార్యాలయంలో వివిధ శాఖ వారు స్పందన కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది స్పందన కార్యక్రమంలో ఆదోని మరియు మండలంకు సంబంధించిన ప్రజలు తమ తమ సమస్యలను వినతి పత్రం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.. అధికారులు మాట్లాడుతూ సమస్యల పరిశీలించిన కోసం సంబంధిత అధికారుల కి రిఫర్ చేయడం జరిగిందని వారన్నారు.. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, డి.ఎల్.పి.ఓ ఎం.పీ.డీ.వో ఎమ్మార్వో,మున్సిపాలిటీ సంబంధించిన అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు





## నీళ్ల కోసం అవస్తపడుతున్న చిన్న హరివనం మరియు చిన్న గోనెహాల్ ప్రజలు

### నీళ్ల దాహం తీర్చలేని పంచాయతీ సెక్రెటరీ
### తీరువ జ్వరాలతో బాధపడుతున్న గ్రామ ప్రజలు
### మాటలు కు మాత్రమే పంచాయతీ సెక్రెటరీ పని



ఆదోని అక్టోబరు 11,( విభారె) -కర్నూలు జిల్లా ఆదోని మండలాల్లోని చిన్న హరివనం,, చిన్న గోనెహాల్,, గ్రామాల్లో మంచినీళ్లు లేక ప్రజలు ఇబ్బంది గురవుతున్నారు,, మంచినీళ్లు కావాలంటే ఎనిమిది రోజుల నుంచి పది రోజులలో ఒకసారి నీళ్లు రావడం అది కూడా ఫిల్టర్ లేని నీళ్లు రావడం తో గ్రామంలో చిన్న పిల్లల పరిస్థితి అది దారుణంగా మారిపోయింది తీరువ డెంగో,మలేరియా, లాంటి జ్వరాలతో ప్రజలు ఆస్పత్రికి పాలవుతున్నారు గ్రామంలో ఉన్న నీళ్ల ట్యాంక్ ను నెలకు ఒక్కసారైనా క్లీన్ చేయాలి కానీ ఇక్కడ సీన్ రివర్స్, చిన్న గోనెహాల్ చిన్నారి హరివాణం లో రెండు నుండి మూడు నెలలు అయినా నీళ్ల ట్యాంక్ ను శుభ్రం చేయలేని పరిస్థితి ఎంతైనా ఉంది.. చిన్న గోనెహాల్ లో ఊర్లో ఉన్న రోడ్లు గాని డ్రైనేజీ వ్యవస్థ అంత దారుణంగా మారిపోయింది ఊర్లో ఉన్న అనేక సమస్యలు పంచాయతీ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది అంటూ గ్రామ ప్రజలు వాపోయారు.. నీళ్ల సమస్య పై అధికారులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకుండా ఉందని పంచాయతీ సెక్రెటరీ కి ఫోన్ చేసి సార్ ఊర్లో కల్తీ నీళ్లు వస్తుందని రెండు మూడు చోట్ల లీకేజ్ ప్రాబ్లం కూడా ఉందని అది మరమ్మత్తులు చేయండి సార్ అంటూ ఎన్నిసార్లు చెప్పినా ఆయనకి చీమకుట్టినట్లు కూడా లేదని,, పంచాయతీ సెక్రెటరీ మాటలు మాత్రం చేపిస్తాను అంటూ వెళ్లిపోతారని గ్రామ ప్రజలు తెలిపారు.. తాగునీటి ట్యాంకు పక్కనే ఉన్న వాల్ చుట్టుపక్కల గలీజ్ నీళ్లు నిలబడి ఆ నీటిలో పాములు,,తేలు,,కప్పలు,,ఆ నీరు ట్యాంక్ లోకి వెళ్ళిపోతుందని ఆ నీరే మేము ఎలా తాగాలని అలాంటి నీళు తాగితే జ్వరాలు రావా అని ప్రజలు వాపోయారు... ఈ విషయంపై పంచాయతీ సెక్రెటరీ కు వివరణ అడిగా ఆయన మాటలు మాత్రం నేను ప్రతి పని చేపిస్తున్న అని సమాధానం ఇచ్చే జారుకుంటున్నారు. దీనిపై పై అధికారులు దృష్టి సాధించాలని సమస్యలు వెంటనే పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు...

## పరమటూర్ బాధిత కుటుంబానికి వాల్మీకి నేతలు ఆర్థిక సహాయం

### వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పులి కొండన్న



నంద్యాల అక్టోబరు 11,( విభారె):- సోమవారం నాడు బండిఆత్మకూరు మండలం పరమటూర్ గ్రామం లో ఈ మద్య కాలంలో హత్య కు గురి అయిన వాల్మీకి వెంకట రమణ కుటుంబానికి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 32 వేల రూపాయలు 1-5 క్వింటాళ్ల సోన మసూరీ బియ్యం ఆర్థిక సహాయంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘర్షణలు పడటం మంచి పద్ధతి కాదని అన్నారు. ఏదైన సమస్య పరిష్కారం కోసం ఉరి యందు పెద్ద మనుషుల దగ్గర తెలపాలని. లేదా కుల సంఘాల నాయకులుకు తెలపాలని అన్నారు . లేదా పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మంచి మనసున్న యమ్ యల్ ఏ శిల్ప చక్రపాణి రెడ్డి వారిని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారని వారికి వెంటనే ఇండ్లు మంజూరు చేయాలని. అలాగే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పారని అన్నారు.

## వాల్మీకి జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి దేశపు ఎద్దుల బండ లాగుడు పోటీలు

తుగ్గలి అక్టోబరు 11,( విభారె) : తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామం నందు శ్రీ వాల్మీకి మహర్షి జయంతి మరియు మందిర నిర్మాణపంచమ వార్షికోత్సవ సందర్భముగా జోన్నగిరి గ్రామము నందు రాష్ట్ర స్థాయి దేశపు ఎద్దుల బండ లాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు జొన్నగిరి వాల్మీకి సేవ సమితి సభ్యులు తెలియజేసారు. 20-10-2021 న ఉదయం 8.00 గం.లకు శ్రీ వాల్మీకి మహర్షి అభిషేకములు, మధ్యాహ్నం 1.00 గంటలకు అన్నప్రసాద సమర్పణ,అనంతరం 4.00 గం.లకు శ్రీవాల్మీకి మహర్షి విగ్రహము ఊరేగింపు కార్యక్రమము నిర్వహిస్తునట్లు వారు తెలియజేసారు.రాష్ట్ర స్థాయి దేశపు ఎద్దుల బండ లాగుడు పోటీలుతేది 20-10-2021న ఉదయం 8.30ని.లకు బండలాగు పోటీలు ప్రారంభమవుతుందనిమొదటి బహుమతి 20,000 రూ,రెండవ బహుమతి 15,000,మూడవ బహుమతి 10,000,నాల్గవ బహుమతి దాత 8,000,ఐదవ బహుమతి దాత 5.000,ఆరవ బహుమతి దాత 3,000,ఏడవ బహుమతి దాత 2,000 రు అందజేయునట్లు వారు తెలియజేసారు.ఆసక్తి గల వారు ఎంట్రీ ఫీజు 300 రూ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వారు తెలియజేసారు.వివరాలకు ఈ నంబర్లను 9010924658,9000073841 సంప్రదించాలని జొన్నగిరి వాల్మీకి సేవా సమితి సభ్యులు తెలియజేశారు.

## ఖాసీం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన స్నేహితులు



తుగ్గలి అక్టోబరు 11,( విభారె) : మండల కేంద్రమైన తుగ్గలి లోని ప్రాథమిక వైద్యశాల యందు ఆరోగ్యమిత్ర గా విధులు నిర్వహిస్తున్న కాశీం గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు.మృతి చెందిన కాశీం కుటుంబానికి పలువురు స్నేహితులు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం రోజున ఖాసీం నివాసం నందు ఖాసీం చిత్రపటానికి పూలమాలలు వేసి తన భార్యకు 132000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కాసిం ఆరోగ్యమిత్ర గా పనిచేస్తూ అందరి మన్ననలు పొందాడని,అటువంటి మంచి వ్యక్తి మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం అని స్నేహితులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అన్వర్,హోటల్ రామాంజనేయ ఖలు,సుంకన్న,ఎ ర్రిస్వామి తదితర స్నేహితులు పాల్గొన్నారు.

## 'మహా సముద్రం' రిలీజ్ ట్రైలర్: లవ్ అండ్ యాక్షన్ కలబోసిన ఎమోషనల్ డ్రామా..!




'ఖీలీ 100' వంటి బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కిస్తున్న సినిమా "మహా సముద్రం". వర్సటైల్ యాక్టర్స్ శర్వానంద్ - సిద్దార్థ్ కలసి నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో అదితిరావు హైదరి - అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్లుగా నటించగా.. జగపతి బాబు - రావు రమేష్ - కేజీయఫ్ గరుడ రామ్ - శరణ్య ఇతర కీలక పాత్రలు పోషించారు. ఇన్టెన్స్ లవ్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందింది. దసరా కానుకగా అక్టోబర్ 14న ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.ఈ నేపథ్యంలో 'మహా సముద్రం' మేకర్స్ శరవేగంగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ - ట్రైలర్ - పాటలు మంచి స్పందన తెచ్చుకున్నాయి. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో ఈరోజు శనివారం గ్రాండ్ గా ప్రీ రిలీజ్ ఈవెంట్ ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మరో ట్రైలర్ ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'భుజాల మీదున్న బరువుని బలమున్న వాడు ఎవడైనా మోస్తాడు.. కానీ మనసులో ఉన్న బాధను బంధాల విలువ తెలిసిన వాడు ఒక్కడే మోయగలడు.. ఆ బంధం ప్రేమైనా స్నేహమైనా..' అని శర్వానంద్ చెప్పే డైలాగ్ తో ఈ ట్రైలర్ ప్రారంభమైంది.ఇందులో లవ్ అండ్ యాక్టన్ తో పాటుగా అజయ్ భూపతి శైలి ఎమోషన్స్ ఎక్కువగా ఉన్నాయని 'మహా సముద్రం' రిలీజ్ ట్రైలర్ చూస్తే అర్థం అవుతుంది. అయితే ఇందులో కూడా కథ ఎంటనేది ప్రేక్షకుడు గెస్ చేయకుండా ట్రైలర్ ని కట్ చేయడం విశేషం. శర్వా - సిద్దార్థ్ లను స్నేహితులుగా చూపించి.. కొన్ని పరిస్థితుల వల్ల ఒకరినొకరు చంపుకోవాలనుకునే బద్ధ శత్రువులుగా మారినట్లు చూపించారు. అదే సమయంలో ఎవరు ఎవరిని లవ్ చేస్తున్నారో అర్థం కాకుండా జాగ్రత్త పడ్డారు.ఒక సీన్ లో శర్వానంద్ - అదితి హత్తుకొని కనిపిస్తుండగా.. మరో సన్నివేశంలో సిద్దార్థ్ - అదితి రొమాన్స్ చేస్తూ కనిపిస్తున్నారు. అలానే శర్వా - అను ఇమ్మాన్యుయేల్ మధ్య లవ్ ట్రాక్ ని కూడా హైలైట్ చేశారు. మొత్తం మీద ఇందులో 'మహా' పాత్రలో నటిస్తున్న అదితిరావు హైదరి పాత్ర చుట్టూ ఈ కథ నడుస్తుందని హింట్ ఇచ్చారు. అంతేకాదు రెండు కాలల్లో జరుగుతుందని వెల్లడించారు. హీరోహీరోయిన్లతో పాటుగా జగపతి బాబు - రావు రమేష్ - గరుడ రామ్ క్యారెక్టర్స్ కూడా ఇందులో శక్తివంతమైనవిగా తెలుస్తోంది. ఇందులో యాక్షన్ పాళ్ళు కాస్త ఎక్కువగా ఉన్నాయి.'కండ బలం ఉన్నోడి కన్నా.. బుద్ధి బలం ఉన్నోడు గొప్పోడు' 'చెంప మీద కొడితే మరో చెంప చూపించడానికి నేనేమన్నా గాంధీ ఫాలోవర్ ని అనుకున్నావా.. భగత్ సింగ్ ఫాలోవర్ ని' 'యముడి పెట్టిన ముహూరం కన్నా.. ఒక్క నిమిషం ముందే చంపేస్తాను' వంటి పవర్ ఫుల్ డైలాగ్స్ ఆలోచింపజేస్తున్నాయి. దీనికి చేతన్ భరద్వాజ్ అందించిన బ్యాగ్రౌండ్ స్కోర్ అద్భుతంగా ఉంది. రాజ్ తోట కెమెరా పనితనం ట్రైలర్ లో కనిపిస్తోంది. మొత్తం మీద ఈ 'మహాసముద్రం' ట్రైలర్ ఎమోషనల్ అండ్ గ్రిప్పింగ్ గా ఆసక్తికరంగా ఉంది.ఆల్రెడీ థియేట్రికల్ ట్రైలర్ యూట్యూబ్ లో మిలియన్ల వ్యూస్ తో దూసుకుపోతుండగా.. ఇప్పుడు రిలీజ్ ట్రైలర్ అంటూ మరొకటి వదిలి 'మహా సముద్రం' మేకర్స్ సరికొత్త ప్రమోషనల్ స్ట్రాటజీకి నాంది పలికారు. ఈ రెండూ కూడా సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సుంకర రామబ్రహ్మం ప్రతిష్టాత్మకంగా భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మించారు. కొల్లా అవినాష్ దీనికి ప్రొడక్షన్ డిజైనర్ గా.. ప్రవీణ్ కేఎల్ ఎడిటర్ గా వర్క్ చేశారు. మరో ఐదు రోజుల్లో థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా ఎలాంటి సంచలన విజయాన్ని నమోదు చేస్తుందో చూడాలి.

## మళ్ళీ థియేటర్ల కోసం కొట్టుకునే పరిస్థితి వచ్చిందిగా..!


కరోనా మహమ్మారి కారణంగా గత రెండేళ్లుగా సినిమా ఇండస్ట్రీ పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సినిమా థియేటర్లు మూతబడి ఉండటం.. తెరిచినా ఆశించిన స్థాయిలో థియేట్రికల్ బిజినెస్ జరగకపోవడం ఫిల్మ్ మేకర్స్ ని కలవరపరిచింది. ఇలాంటి సమయంలో చిన్న సినిమాలకు కావాల్సినన్ని థియేటర్లు దొరికాయి. అందుకే కోవిడ్ సెకండ్ వేవ్ తర్వాత వారానికి అర డజను చిత్రాలను థియేట్రికల్ రిలీజ్ చేశారు.అయితే ఇప్పుడు పరిస్థితులు చాలా మెరుగయ్యాయి.



కరోనా తగ్గుముఖం పట్టడంతో జనాలు థియేటర్ల వైపు నడవడం మొదలుపెట్టారు. ఇటీవల విడుదలైన సినిమాల థియేట్రికల్ బిజినెస్ బాగుండటంతో.. ఇప్పుడు వరుసపెట్టి రిలీజ్ డేట్స్ అనౌన్స్ చేస్తున్నారు. దీంతో మళ్ళీ ఎప్పటిలాగే థియేటర్ల కోసం ఫైట్ చేసే పరిస్థితి వచ్చింది. ఇన్నాళ్లు చిన్న సినిమాలు కాబట్టి ఎలాగోలా నడిచిపోయింది. కానీ ఇప్పుడు ఒకేసారి క్రేజీ మూవీస్ వస్తుండటం వల్ల క్లాష్ ఏర్పడి థియేటర్ల కొరత వచ్చింది.ఇప్పుడు దసరా మొదలుకొని సంక్రాంతి వరకు కొన్ని పెద్ద సినిమాల విడుదల తేదీలు ఇచ్చేశారు. దసరా సీజన్ కోసం 'మహా సముద్రం' 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' 'వరుడు కావలెను' 'పెళ్లి సందఆ' వంటి సినిమాలు రెడీ అయ్యాయి. నాలుగు సినిమాలు ఒకే టైం లో వస్తున్నాయంటే అన్నిటికీ ఎక్కువ స్క్రీన్లు దొరకాలంటే కష్టమే. అందులోనూ ఇప్పటికే రిలీజైన 'లవ్ స్టోరీ' 'సీటీమార్' 'రిపబ్లిక్' వంటి సినిమాలు థియేటర్లలో ఉన్నాయి. ఇప్పుడు 'కొండపొలం' కూడా వచ్చింది.ఈ నేపథ్యంలో దసరా బరిలో నిలిచే సినిమాలను ఎక్కువ స్క్రీన్స్ లో రిలీజ్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. అఖిల్ అక్కినేని హీరోగా నటించిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్' చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మించిన సంగతి తెలిసిందే. గీతా వారి సినిమా అంటే రిలీజ్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఇప్పుడు బ్యాచిలర్ చిత్రాన్ని కూడా అధిక థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అక్టోబర్ 15న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## బాలీవుడ్ లో ఫుల్ బిజీగా టాలీవుడ్ బ్యూటీ..!

ఒకప్పుడు తెలుగులో అగ్ర కథానాయికగా వెలుగొందిన రకుల్ ప్రీత్ సింగ్.. స్టార్ హీరోల దగ్గర నుంచి కుర్ర హీరోల వరకు అందరితో ఆడిపాడింది. అయితే ఇప్పుడు అమ్మడికి టాలీవుడ్ లో అవకాశాలు లేవనే అనుకోవాలి. 'మన్మథుడు 2' సినిమా తర్వాత చాలా గ్యాప్ తీసుకొని ఈ ఏడాది 'చెక్' తో పలకరించింది. లేటెస్టుగా వచ్చిన 'కొండ పొలం' సినిమా కూడా అప్పుడెప్పుడో పూర్తైనదే. దీంతో రకుల్ చేతిలో ప్రస్తుతం ఒక్కటంటే ఒక్క తెలుగు ప్రాజెక్ట్ కూడా లేదు. కాకపోతే తమిళ హిందీ భాషల్లో మాత్రం వరుస ఆఫర్స్ అందుకుంటోంది.రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్ గా రెండు తమిళ సినిమాలు చేస్తోంది. అలానే హిందీలో నాలుగు ప్రాజెక్ట్స్ తో బిజీగా వుంది.



ఇటీవల 'సర్దార్ కా గ్రాండ్ సన్' సినిమాతో అలరించిన రకుల్.. జాన్ అబ్రహం తో కలిసి 'ఎటాక్' అనే సినిమా చేసింది. 2022 రిపబ్లిక్ డే సందర్భంగా ఈ మూవీ రిలీజ్ కానుంది. బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగన్ తో 'దే దే ప్యార్ దే' తర్వాత అమ్మడికి మరో రెండు అవకాశాలు అందించారు. అజయ్ దేవగన్ - అమితాబ్ బచ్చన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'మే డే'. అజయ్ డైరెక్ట్ చేస్తూ నిర్మిస్తున్న ఈ సినిమాలో రకుల్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పుడు తన పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తి చేసారు.అలానే అజయ్ దేవగన్ - సిద్దార్థ్ మల్హోత్రా హీరోలుగా నటిస్తున్న మల్టీస్టారర్ మూవీ 'థ్యాంక్ గాడ్' చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ నే హీరోయిన్ గా తీసుకున్నారు. ఈ రెండు ప్రాజెక్ట్స్ లో ఈ బ్యూటీని తీసుకోవడం వెనుక అజయ్ హస్తం ఉందని టాక్ ఉంది. అంతేకాదు 'దే దే ప్యార్ దే' చిత్రానికి సీక్వెల్ చేస్తే రకుల్ ని కూడా కొనసాగించే అవకాశం ఉందని అంటున్నారు. ఇక 'బెల్ బాటమ్' దర్శకుడితో స్టార్ హీరో అక్షయ్ కుమార్ చేస్తున్న 'మిషన్ సిండ్రెల్లా' సినిమాలోనూ రకుల్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ కంప్లీట్ చేసింది ఇది తెలుగు తమిళ భాషల్లో హిట్ అయిన 'రాక్షసుడు' చిత్రానికి హిందీ రీమేక్.ఇదే క్రమంలో ఆయుష్మాన్ ఖురానా హీరోగా రూపొందుతోన్న 'డాక్టర్ జీ' సినిమాలో నటిస్తున్న రకుల్ ప్రీత్ హీరోయిన్ గా చేస్తోంది. ఈ మూవీ షూటింగ్ కూడా ఫినిష్ చేసినట్లు 'కొండ పొలం' ప్రమోషన్స్ లో అమ్మడు వెల్లడించింది. హిందీలో నటిస్తున్న నాలుగు సినిమాలు రిలీజ్ అయితే రకుల్ క్రేజ్ మరో స్థాయికి వెళ్లే ఛాన్స్ ఉంది. ఏదేమైనా బక్క చిక్కిపోయిన తర్వాత బాలీవుడ్ లో ఈ బ్యూటీకి మంచి అవకాశాలు వస్తున్నాయని అర్థం అవుతోంది. ఇక మంచి కంటెంట్ తో వస్తే ఓటీటీలో కనిపించడానికి కూడా రెడీ అంటోంది. ఓటీటీ ఆఫర్లు వస్తున్నా కూడా వస్తున్నాయి. ఓటీటీలోకి వస్తే కచ్చితంగా అది పాత్ బ్రేకింగ్ లా ఉండాలని రకుల్ ప్రీత్ సింగ్ చెబుతోంది.ఇప్పు 'కొండ పొలం' చిత్రంలో పెర్ఫార్మన్స్ చూసి మళ్ళీ తెలుగులో ఆఫర్స్ వస్తాయేమో చూడాలి. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పంజా వైష్ణవ్ తేజ్ సరసన రకుల్ హీరోయిన్ గా చేసింది. ఓబులమ్మ అనే పల్లెటూరి అమ్మాయిగా గొర్రెలు కాసే పాత్రలో అమ్మడు మెప్పించింది. దీని తర్వాత రకుల్ తెలుగులో ఎన్ని ప్రాజెక్ట్స్ సైన్ చేస్తుందో చూడాలి.

## ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా సందీప్ లమిచ్చానే



సందీప్ లమిచ్చానే, నేపాల్ క్రికెటర్ సెప్టెంబర్ నెలకు గానూ ప్రతిష్టాత్మక మెన్స్ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును నేపాల్ లెగ్ స్పిన్నర్ సందీప్ లమిచ్చానే సొంతం చేసుకున్నాడు. ఇక మహిళల విభాగంలో ఇంగ్లండ్‌కు చెందిన హెథర్ నైట్ వుమెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఎంపికైంది. కాగా లమిచ్చానేకు బంగ్లాదేశ్ బౌలర్ నసూమ్ అహ్మద్, యూఎస్ఏ బ్యాటర్ జస్కన్ మల్హోత్రాలతో గట్టిపోటీ ఎదురైంది. ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్‌కప్ లీగ్ 2లో చేసిన ప్రదర్శన ఆధారంగానే సందీప్ లమిచ్చానే ఈ అవార్డుకు ఎంపికయ్యడంటూ దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్, ఐసీసీ ఓటింగ్ అకాడమీ మెంబర్ జేపీ డుమిని పేర్కొన్నాడు.ఆ టోర్నమెంట్‌లో 6 వన్డేలాడిన లమిచ్చానే 3.17 ఎకానమీ రేటుతో 18 వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా ఒమన్, పపువా న్యూజినియాతో జరిగిన మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. పపువా న్యూ జినియాతో మ్యాచ్‌ల్లో 4/35, 6/11 నమోదు చేసిన లమిచ్చానే ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 4/18తో మెరిశాడు. కాగా లమిచ్చానే గతంలో ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇక నేపాల్ తరపున 16 వన్డేల్లో 41 వికెట్లు.. 26 టి20ల్లో 47 వికెట్లు పడగొట్టాడు.ఇక వుమెన్స్ విభాగంలో అవార్డు గెలుచుకున్న హెథర్ నైట్ స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను ఇంగ్లండ్ 4-1తో గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించింది. బ్యాటింగ్‌లో 214 పరుగులు చేసిన నైట్ బౌలింగ్‌లోనూ మూడు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచింది.

### అరుదైన రికార్డుకు చేరువలో హర్షల్ పటేల్..

ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్ హర్షల్ పటేల్ అరుదైన ఘనతకు చేరువలో ఉన్నాడు. ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక వికెట్ల తీసిన రికార్డు చెన్నై బౌలర్ డ్వేన్ బ్రావో పేరిట ఉంది. 2013




సీజన్‌లో బ్రేవో ఏకంగా 32 వికెట్లు పడగొట్టాడు. కాగా ప్రస్తుతం ఈ సీజన్‌లో హర్షల్ ఖాతాలో 30 వికెట్లు ఉన్నాయి. నేడు కోల్‌కతాతో జరగనున్న మ్యాచ్‌లో మరో రెండు వికెట్లు సాధిస్తే ఆ ఘనత అతడి సొంతమవుతుంది.ఇప్పటికే ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా హర్షల్ పటేల్ నిలిచిన సంగతి తెలిసిందే. ఎలిమినేటర్ మ్యాచ్ లో భాగంగా నేడు(సోమవారం) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. కోల్‌కతా నైట్ రైడర్స్ తో తలపడనుంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**